ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 13.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 294 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

యూపీపై ఆర్‌సీబీ ఘనవిజయం 10



గత ప్రభుత్వం అశాస్త్రీయంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం వల్ల పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. గతంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు అడ్డగోలుగా జరిగిందన్న సీఎం, జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేయనున్నట్లు వివరించారు.

జిల్లాలను పునర్ వ్యవస్థీకరిస్తాం

అశాస్త్రీయంగా జిల్లాలు, మండలాల ఏర్పాటు

పాలనా వ్యవస్థను సమర్థవంతం చేయడానికి అవసరం

- జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయి
- రేషనలైజ్ చేయడానికి రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిషన్
- అన్ని జిల్లాల్లో మండలాలు సమానంగా ఉండేలా చర్యలు
- అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకున్నాకే విధివిధానాలు
- ప్రభుత్వ ఉద్యోగులకు 'సంక్రాంతి' తీపి కబురు
- 3.64శాతం డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ
- సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు..

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 12: రాష్ట్రంలో గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలు, మండలాలను రేషనలైజ్ చేస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ అండ్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పాలనలో సమస్యలు సృష్టించిన ఈ జిల్లాల ఏర్పాటును సమీక్షించి సరిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాష్ట్రంలోని పాలనా వ్యవస్థను మరింత సమర్థవంతం చేయడానికి అవసరమన్నారు. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా

...:: మిగతా 2లో

కో ఆప్షన్ సభ్యులుగా 'ట్రాన్స్‌జెండర్స్'

- దివ్యాంగులను పెళ్లి చేసుకుంటే ఆర్థిక సాయం
- రూ.2 లక్షల ఆర్థిక సాయం చేస్తాం
- బాల భరోసా పథకాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి

...:: 2లో

చలానా పడగానే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్

బ్యాంకులతో సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించండి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 12: మైనర్లు వాహనాలు నడపడం, డ్రంకెన్ డ్రైవ్ చేసేవారిని నియంత్రించాలని, ఉల్లంఘనలపై చలాన్లు వేస్తున్నారని, మళ్లీ వాటిని కట్టడానికి ఆఫర్లు ఇస్తున్నారని, వారి బ్యాంక్ అకౌంట్లతో వాహనాలను అనుసంధానం చేసి, చలాన్ పడిన వెంటనే వారి బ్యాంక్ ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ అయ్యేలా బ్యాంకులతో సమన్వయం చేసుకుని ప్రణాళికలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పిల్లలకు

...:: మిగతా 2లో

- ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి
- ట్రాఫిక్ నియంత్రణకు ఆధునిక పరిజ్ఞానం వినియోగించుకోండి
- రవాణా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలి
- 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో సీఎం

ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్ట్

- దేశంలోనే రోల్ మోడల్, గేమ్ చేంజర్
- పనుల పూర్తి క్యాలెండర్ ఖరారు చేయండి
- నిధులకు ఇబ్బంది లేదు.. ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లిసాతం
- జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 12: అంతర్జాతీయ ప్రమాణాలతో మన పిల్లలు ప్రపంచంతో పోటీపడేలా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ రాష్ట్ర ప్రభుత్వం డ్రీం ప్రాజెక్టు అని డిప్యూటీ సీఎం

...:: మిగతా 2లో

వందేభారత్ స్లీపర్ ఛార్జీలు ఖరారు..

వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. ఈ రైలు కోల్‌కతా- గువాహటి మధ్య త్వరలో పరుగులు పెట్టనుంది. ఈ నేపథ్యంలో వందే భారత్ స్లీపర్ రైలుకు సంబంధించిన ఛార్జీల వివరాలు, బుకింగ్ రూల్స్‌ను రైల్వే శాఖ నోటిఫై చేసింది.

9

చైనా గుత్తాధిపత్యానికి జపాన్ 'చెక్'

ప్రపంచ సాంకేతికత, ఆధునిక యుద్ధానికి పునాది అయిన అరుదైన భూమి లోహాలపై చైనా గుత్తాధిపత్యం కలిగి ఉంది. 2025లో చైనా విధించిన ఆంక్షల తరువాత ఇండియా స్నేహితుడు అయిన జపాన్ బీజింగ్‌కు చెక్ పెట్టింది.

9



షక్స్‌గామ్‌పై చైనా కొత్త వాదన

షక్స్ గామ్ వ్యాలీ...ఇది పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో ఒక భాగం. మొత్తం 5, 180 చదరపు కిలోమీటర్ల భూభాగం. దీన్ని 1963లో పాక్ చట్ట విరుద్ధంగా చైనాకు అప్పగించింది. అయితే భారత్ అప్పటి నుంచి దీన్ని ఒప్పుకోవడం లేదు.

9

బంగ్లాలో ఆగని హింస

బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు ఆగడం లేదు. తాజాగా సమీర్ దాస్ అనే హిందూ ఆటో డ్రైవర్‌ను దుండగులు కొట్టి చంపారు. చిట్టగాంగ్‌లోని దగన్‌భునియా అనే ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

9

జిల్లాల జోలికొస్తే ఊరుకోం

జిల్లాలను ముట్టుకుంటే అగ్గిపుడుతది

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహబూబ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనం

ప్రతిపక్షం ప్రతినిధి, మహబూబ్‌నగర్

జనవరి 12: కేసీఆర్ హయాంలో అశాస్త్రీయంగా జిల్లాల విభజన జరిగిందని, తాము జిల్లాలను కుదిస్తామని, కొన్ని జిల్లాలను తొలగిస్తామని ఇటీవల అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. జిల్లాలను ముట్టుకుంటే అగ్గిపుడుతుందని, ఆ అగ్గిని పుట్టించే బాధ్యత బీఆర్‌ఎస్ పార్టీయే తీసుకుంటదని అన్నారు. మహబూబ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ఈ హెచ్చరిక చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'మొన్న అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి చెప్తున్నడు. కేసీఆర్ ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేసిందట. కేసీఆర్‌గారు ప్రజలకు పాలనను చేరువచేసేందుకు రాష్ట్రంలోని 10 జిల్లాలను 31 జిల్లాలకు పెంచారు. మహబూబ్‌నగర్ జిల్లాను మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల్, వనపర్తి జిల్లాలుగా విభజించారు. తండాల పాలనను తండా వాసుల చేతుల్లోనే పెట్టేందుకు వాటిని గ్రామ పంచాయతీలుగా మార్చారు' అని చెప్పారు. 'ఇప్పుడు కాంగ్రెసోళ్లు ఏమంటున్నరు..? మహబూబ్‌నగర్‌ను ఐదు ముక్కలు చేసేది లేకుండెనట. తండాలను గ్రామ పంచాయతీలు చేసేది లేకుండెనట. కేసీఆర్ తప్పు చేసిండట. ఇప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాలను రద్దు చేస్తరట. ఈ విషయాన్ని మొన్న రెవెన్యూ మంత్రి అసెంబ్లీలో ప్రకటించారు. జిల్లాలను శాస్త్రీయంగా విభజించలేదు కాబట్టి అన్నింటిని తీసేస్తాం అంటున్నరు. మరె జిల్లాలను తీసేస్తే నారాయణపేటోళ్లు ఊకుంటరా..? గద్వాలోళ్లు, వనపర్తోళ్లు ఊకుంటరా..? నేను రేవంత్‌రెడ్డికి ఒక్కటే హెచ్చరిక చేస్తున్నా. గద్వాల జిల్లాను

...:: మిగతా 2లో

పోలవరం- నల్లమల సాగర్ వివాదం

సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ

- పిటిషన్ డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ప్రకటించిన సీజేఐ
- రిట్ పిటిషన్ వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్న ధర్మాసనం
- మా అభ్యంతరాలతో రిట్ పిటిషన్ వేశాం: మంత్రి ఉత్తమ్
- సివిల్ సూట్ రూపంలో మళ్లీ రావాలని న్యాయస్థానం చెప్పింది

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 12: సుప్రీంకోర్టులో పోలవరం, నల్లమల సాగర్‌ప్రాజెక్టుపై దాఖలు చేసిన రిట్‌పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీంతో పిటిషన్ డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ప్రధాన న్యాయమూర్తి ప్రకటించారు. అంతకుముందు నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం కాగా, తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది

...:: మిగతా 2లో



అట్టుడుకుతున్న ఇరాన్..

500 మందికిపైగా మృతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 12: ఇరాన్ అట్టుడుకుతున్నది. ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. అదే సమయంలో నిరసనలపై ఆ దేశం ఉక్కుపాదం మోపుతోంది. సైన్యం కాల్పుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ ఆందోళనల్లో మృతుల సంఖ్య 500 దాటింది. దాదాపు 530 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం తెలిపింది. దాదాపు 490 మంది నిరసనకారులు కాగా, 48 మంది భద్రతా సిబ్బంది మరణించినట్లు సమాచారం. రెండు వారాల్లో దాదాపు 10,600 మందికి పైగా అరెస్ట్ అయినట్లు పేర్కొంది. ఇరాన్ దవాఖానలు శవాల కుప్పలతో నిండిపోయినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. టెహ్రాన్ సహా దేశవ్యాప్తంగా దవాఖానల్లో శవాలు ఒకదానిపై మరొకటి పడి ఉన్నాయని, రోగులతో వార్డులు కిటకిటలాడుతున్నాయని మెడికల్ వర్కర్స్ తెలిపారు. మరోవైపు ఇరాన్‌లో తాజా పరిస్థితులపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఖమేనీ ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్‌పై సైనిక చర్య అవకాశాల్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తోంది. ఆందోళనకారులకు ఏమైనా జరిగితే తాము రంగంలోకి దిగుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే హెచ్చరిస్తున్నారు. దీంతో ఇరాన్ సైతం అమెరికాకు కీలక హెచ్చరికలు చేసింది. సైనిక చర్య బెదిరింపులు చేస్తే అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటామని టెహ్రాన్ బెదిరింపులకు పాల్పడింది.

రాష్ట్రీయం

ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్ట్

మొదటిపేజీ తరువాయి

భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ప్రజాభవన్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లు, చీఫ్ సెక్రటరీ తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ ప్రగతిపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం పూర్తిచేసే బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్ల దేనిని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. టెండర్లు పూర్తి అయినచోట మంత్రి లేదా స్థానిక ఎమ్మెల్యే తో భూమి పూజ చేయించాలని, భవనాల నిర్మాణం పూర్తికి క్యాలెండర్ ఫిక్స్ చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు ప్రతి వారం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ ప్రగతిపై సమీక్ష జరపాలని నెలలో ఒకసారి కలెక్టర్లు తమ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ ప్రదేశానికి తప్పకుండా వెళ్లాలని అక్కడే సమీక్ష నిర్వహించాలని తెలిపారు. స్కూల్స్ నిర్మాణంలో నిధులకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది లేదు ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్స్ పేమెంట్ జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఇప్పటివరకు విడివిడిగా ఉన్నాయని, వీటన్నిటిని ఒకే చోట చేర్చి ఒక గొప్ప సందేశాన్ని ప్రపంచానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వబోతున్న అని తెలిపారు. సమాజంలో వర్గాలుగా విడగొట్టబడినట్టు ఉన్న వారందరినీ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా ఒకచోటకు తమ ప్రభుత్వం తీసుకురాబోతుందని తెలిపారు. ఈ పాఠశాలలు దేశంలోనే ఒక రోల్ మోడల్ గా, గేమ్ చేంజెర్లుగా మారలు ఉన్నాయని తెలిపారు. అగ్రిమెంట్ పూర్తి చేసుకున్న 15 రోజుల్లో కాంట్రాక్టర్లు పని ప్రారంభించకపోతే కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి అత్యధిక శాతం స్కూల్స్ అందుబాటులోకి రావాలని ఆదేశించారు. స్థానికంగా భూమి ఇతర సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మెల్యే లేదా సిసిఎల్ఏ, చీఫ్ సెక్రటరీ తో కలెక్టర్లు మాట్లాడుకుని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. బిల్డింగ్స్ నిర్మాణంలో ఎప్పటికప్పుడు క్వాలిటీ చెక్ కోసం థర్డ్ పార్టీ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని, నిర్మాణం జరిగే ప్రాంతానికే క్వాలిటీ చెక్ బృందం వెళ్లాలని ఆదేశించారు. పనుల ప్రగతిపై వారానికి ఒకసారి చీఫ్ సెక్రటరీ కలెక్టర్ల నుంచి నివేదిక తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి అట్లూరి లక్ష్మణ్, ఎంపీ బలరాం నాయక్, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తాన్య, టీజీడబ్ల్యుడీసీ ఎండీ గణపతి రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలను పునర్ వ్యవస్థీకరిస్తాం

మొదటిపేజీ తరువాయి

కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం వల్ల పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. గతంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు అడ్డగోలుగా జరిగిందన్న సీఎం, జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేయనున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే కొత్త జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదని, అందుకే మార్చినట్లు సీఎం పేర్కొన్నారు. రాచకొండ పేరు రాచరిక పాలనకు గుర్తుగా ఉందని మార్చామన్నారు. సికింద్రాబాద్ విషయంలో తాను వచ్చాక చేసిందేమీ లేదని, సికింద్రాబాద్ గతంలోనే జీహెచ్ఎంసీలో భాగంగా ఉందని స్పష్టం చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని, ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి త్వరలో రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ కమిషన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.ఈ కమిషన్ ఆరు నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ పై నివేదిక సమర్పిస్తుందని సీఎం చెప్పారు. అన్నిజిల్లాల్లో మండలాలు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే, బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని, విధివిధానాలు రూపొందిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు

సంక్రాంతి పండుగ సందర్భంగా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంచుతూ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం సాయంత్రం అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. 2023, జులై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2026 జనవరి మాసంలో తీసుకునే జీతంతో కలిపి ఈ డీఏ చెల్లించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వివరించింది. జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఉద్యోగులకు సైతం ఈ డీఏను వర్తింప చేయనున్నారు. యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఈ డీఏ కింద నిధులు చెల్లించనున్నారు. 30.03 శాతం నుంచి 33.67(3.64శాతం) శాతానికి ఈ డీఏను ప్రభుత్వం సవరించిన విషయం విదితమే.

ఉద్యోగులే సారథులు..వారధులు

ఉద్యోగులే తమ సారథులు, వారధులు అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, గత ప్రభుత్వం వదిలివెళ్లిన అప్పులు తీర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరన్న ముఖ్యమంత్రి, రాష్ట్రాన్ని నడిపేది 10.50 లక్షల మంది ఉద్యోగులని, ఉద్యోగులు సరిగా పని చేయడం వల్లే పథకాలు సరిగా అమలు అవుతున్నాయని కితాబిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్ ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే కావాల్సిన నిధులు అవే వస్తాయన్నారు. పన్నులు పెంచాల్సిన అవసరం లేదని, సరిగా వసూళ్లు చేస్తే చాలన్న సీఎం, చాలా మందిని పన్ను కట్టాలని ఉద్యోగులు అడగట్లేదన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఈ కార్యక్రమానికి వచ్చినట్లు చెప్పిన రేవంత్ రెడ్డి, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు. సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఈ కార్యక్రమానికి వచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఆయనతో పాటు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తో పాటు టీఎన్జీఓ సంఘ నేతలు పాల్గొన్నారు.

పోలవరం- నల్లమల సాగర్ వివాదం

సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్ వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని న్యాయస్థానం సూచించింది. సూట్ దాఖలు చేస్తే గోదావరి నది పరీవాహక రాష్ట్రాల అభిప్రాయాలు పరిగణనలోకి వస్తాయని ధర్మాసనం పేర్కొంది. ఇంకా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వాదనలు కూడా వినాల్సి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

మా వాదనలు వినిపించాం...

ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం నిర్మాణం చేయాలనుకుంటున్న ప్రాజెక్టుపై తమ అభ్యంతరాలతో రిట్ పిటిషన్ వేసినట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో మీడియాకు తెలిపారు. ఆర్టికల్ 131 రూపంలో రావాలని సీజేఐ సూచించారన్న మంత్రి ఉత్తమ్, సివిల్ సూట్ రూపంలో మళ్లీ రావాలని న్యాయస్థానం చెప్పిందన్నారు. సీజేఐ సూచన మేరకు పిటిషన్ ఉపసంహరించుకున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున తమ వాదనలు బలంగా వినిపించినట్లు తెలిపారు. గత సోమవారం కూడా విచారణ జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం తరఫున తమ వాదనలు వినిపించినట్లు చెప్పారు. గత సోమవారం ఇచ్చిన వాదనలకు అదనంగా ఇవాళ మరికొన్ని వాదనలు వినిపించామని అన్నారు. కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ఇందులో ముఖ్యమైన అంశమని ఆయన పేర్కొన్నారు.

స్టాప్‌వర్క్‌ఆర్డర్‌ను అమలు చేయట్లేదు...

నీళ్ల విషయంలో ఏపీ ప్రభుత్వం అనేక ఉల్లంఘనలు చేసిందని, వాటన్నింటినీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయట్లేదని కూడా కోర్టుకు వివరించామన్నారు. ఏపీకి కేటాయించిన 484.5 టీఎంసీలు ఎక్కువగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఏపీ ప్రభుత్వం గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ముందుకెళ్తోందని ధర్మాసనానికి చెప్పామన్నారు. అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమల సాగర్‌కు లింక్ చేసేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తక్షణమే ఈ పనులు ఆపేలా ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరింది. పోలవరం ప్రాజెక్టు విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కాదని, తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రీ ఫీజిబులిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించటం సమంజసం కాదని తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం తెలిపింది.

కోఆప్షన్ సభ్యులుగా 'ట్రాన్స్‌జెండర్స్'

- దివ్యాంగులను పెళ్లి చేసుకుంటే ఆర్థిక సాయం
- రూ.2 లక్షల ఆర్థిక సాయం చేస్తాం
- బాల భరోసా పథకాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 12: ట్రాన్స్ జెండర్స్‌కు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్‌ని నామినేట్ చేయాలని కోరారు. ట్రాన్స్ జెండర్ సమస్యలను వాళ్లే చెప్పుకునే అవకాశం ఇవ్వాలని, ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దివ్యాంగులకు మానవీయకోణంలో సహకారం అందిస్తున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. రూ. 50 కోట్లతో దివ్యాంగులకు పరికరాలు అందించామన్నారు. ప్రజాభవన్లో సోమవారం 'బాల భరోసా', 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దివ్యాంగులకు సహాయ ఉపకరణాల ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, రాజనర్సింహ, సీతక్క హాజరయ్యారు.

దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే రూ.2 లక్షల సాయం.

కుటుంబసభ్యులను ఆదరించినట్లు దివ్యాంగులను చూస్తున్నామని, ప్రభుత్వం వారి కోసం ఉందని చెప్పడానికే ఈ కార్యక్రమమే ఉదాహరణ అని రేవంత్ రెడ్డి అన్నారు. దివ్యాంగులను దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే రూ.2 లక్షల ఆర్థిక సాయం చేస్తామని, దివ్యాంగులను ఇతరులు పెళ్లి చేసుకున్నా ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం ఇస్తామని హామీ ఇచ్చారు. క్రీడల్లో రాణించిన దివ్యాంగులకు ఉద్యోగాలు ఇస్తామని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించుకుని దివ్యాంగులు ఎదగాలని తెలిపారు. ఈ ప్రాంతంలో దివ్యాంగులకు స్ఫూర్తి జైపాల్ రెడ్డి అని అన్నారు.

తల్లితండ్రులను నిర్లక్ష్యం చేస్తే..

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15 శాతం కోత విధిస్తామని స్పష్టం సీఎం చేశారు. బడ్జెట్ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తున్నామని అన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిని మనమే దారిలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులపై బాధ్యత లేని వారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిఒక్కరికీ వైద్యం అందించాలనేదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ సమాజం స్వేచ్ఛను, సమాజిక న్యాయం, సమాన అవకాశాన్ని కోరుకుంటుందని అన్నారు. 100 ఏళ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కులగణన జరిగిందని గుర్తు చేశారు. కులాల జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలని, తమ ఒత్తిడితోనే కేంద్రం కులగణన చేస్తుందని తెలిపారు. ఈ ప్రభుత్వానికి ధర్మగంట ఉంటుందని, ఎవరు కొట్టినా వింటానని వెల్లడించారు. ఎక్కడికి వెళ్తే సమస్యలు పరిష్కారమవుతాయో ప్రజలకు తెలుసునని, సమస్యలు పరిష్కరించే వ్యవస్థలను నిర్మించామని వివరించారు.

దివ్యాంగుల కోసం జీవో నంబర్ 34 ..

కేవలం రెండు సంవత్సరాల్లోనే దివ్యాంగుల కోసం రూ.100 కోట్లు ఖర్చు చేశామని, గత ప్రభుత్వం దివ్యాంగుల కోసం కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దివ్యాంగుల బాధ్యతను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. దివ్యాంగుల కోసం జీవో నంబర్ 34ను తీసుకొచ్చామని, పని చేసిన చోటే పదోన్నతి వచ్చేలా దివ్యాంగుల కోసం జీవో తెచ్చామని వెల్లడించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే 5 కోట్ల ఆస్తులు సీజ్

- బినామీ యాక్ట్ కింద ఆస్తులను అటాచ్ చేసిన ఐటీ అధికారులు
- ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి భూముల కొనుగోలుపై ఆరా

ప్రతిపక్షం స్టేట్ బ్యూ రో, హైదరాబాద్, జనవరి 12: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి చెందిన రూ.5కోట్ల విలువైన ఆస్తులను ఐటీ (ఆదాయపు పన్ను) అధికారులు అటాచ్ చేశారు. బినామీ యాక్ట్ కింద సిద్ధిపేట, జనగామలో ఆయనకు చెందిన పలు విలువైన ఆస్తులను అటాచ్ చేస్తూ ఐటీ అధికారులు సోమవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తన కుమార్తె తుల్జా భవానీ రెడ్డి పేరు మీద జనగామ, సిద్ధిపేటలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పలు భూములు కొనుగోలు చేశారు. దీనిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఐటీ అధికారులు రంగంలోకి దిగి.. ఆ దిశగా విచారణ చేపట్టారు. తన కుమార్తెను బినామీగా పెట్టి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఐటీ అధికారులకు పలు ఆధారాలు లభ్యమయ్యాయి. ఆ క్రమంలో ఈ భూముల కొనుగోలుపై యాదగిరిరెడ్డి కుమార్తె తుల్జా భవానీరెడ్డిని విచారించారు. ఈ భూములు కొనుగోలు చేసేందుకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందంటూ తుల్జా భవానీ రెడ్డిని ఐటీ అధికారులు ప్రశ్నించారు. ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చిందో తనకు తెలియదని ఐటీ అధికారులకు ఆమె వెల్లడించింది. తన తండ్రి సంతకం పెట్టమని చెబితేనే.. తాను ఈ భూములకు చెందిన సేల్ డీడ్‌పై సంతకం చేశానంటూ ఐటీ అధికారులకు తుల్జా భవానీ దేవి వివరించారు. ఆమె చెప్పిన స్టేట్‌మెంట్‌ను ఐటీ శాఖ ఉన్నతాధికారులు రికార్డు చేశారు. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా సిద్దిపేట, జనగామలో రూ.5కోట్లు విలువైన ఆస్తులను ఐటీ శాఖ అధికారులు ఫ్రీజ్ చేశారు.

జిల్లాల జోలికొస్తే ఊరుకోం

మొదటిపేజీ తరువాయి

ముట్టినా.. నారాయణపేట జిల్లాను ముట్టినా.. వనపర్తి జిల్లాను ముట్టినా.. అక్కడ అగ్గిపుడుతది. ఆ అగ్గిపుట్టించే బాధ్యత బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటది' అని కేటీఆర్ అన్నారు. జిల్లాల జోలికొస్తే అక్కడే ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ప్రజలు మీ అడ్డగోలు హామీలకు మోసపోయి అధికారం ఇచ్చారని, మీకు చేతనైతే ఇచ్చిన హామీలను నెరవేర్చండి అని కేటీఆర్‌సవాల్ చేశారు.

కేసీఆర్ హయంలోనే మిగులు విద్యుత్

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి కావడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చీకట్లో మునిగిపోతుందని ఆనాడు కొందరు అసత్యాలు ప్రచారం చేశారని, ఆ మాటలను తెలంగాణ పటాపంచలు చేసిందని అన్నారు. ఆనాడు అసత్యాలు ప్రచారం చేసిన వారే ఇప్పుడు చీకట్లో మిగిలిపోయారని, తెలంగాణ మాత్రం వెలుగుల్లో మెరిసిపోతోందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ విద్యుత్ మిగులు రాష్ట్రంగా మారిందని కేటీఆర్ అన్నాను. దేశంలోనే అతిపెద్ద రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని పవర్ ప్రాజెక్టుల్లో ఒకటైన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నాలుగో యూనిట్ లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుందని చెప్పారు. ఇది తెలంగాణ విద్యుత్ రంగంలో పెద్ద మైలురాయి అని అన్నారు. కేసీఆర్ స్వప్నాన్ని సాకారం చేసిన విద్యుత్ శాఖ ఇంజినీర్లు, సిబ్బంది, భాగస్వాములందరికీ అభినందనలు తెలిపారు. తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అసలైన రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే ఉంటుందని ఉద్ఘాటించారు. ఆదివారం నాడు ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ముఖ్య నేతలతో పురపాలక ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన గెలుపు కేవలం గాలివాటం మాత్రమేనని కొట్టిపారేశారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్లే అది సాధ్యమైందని, క్షేత్రస్థాయిలో బీజేపీకి ఎలాంటి బలం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ సీనియర్ నేతలు ఘోరంగా ఓడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు.గడిచిన 24 నెలల కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యాలతో నిండిపోయిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఇటీవలి ఉప ఎన్నికలు, పంచాయతీ పోల్స్‌లో ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రోశయ్య సతీమణి కన్నుమూత

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 12: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య సతీమణి శివలక్ష్మి కన్నుమూశారు. సోమవారం తెల్లవారుజామున ఆమె తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్ అమీర్‌పేటలోని తన నివాసంలో మరణించారు. 2021లో రోశయ్య మృతిచెందిన తరువాత ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి అమీర్‌పేటలోనే నివసిస్తున్నారు.శివలక్ష్మి నిరాడంబరతకు నిలువుటద్దంగా ఉండేవారు. రోశయ్య రాష్ట్ర రాజకీయాల్లో మంత్రిగా, ముఖ్యమంత్రిగా, అనంతరం తమిళనాడు గవర్నర్‌గా అత్యున్నత పదవులు చేపట్టినా. ఆమె ఎప్పుడూ తెరవెనుకే ఉండేవారు. కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. భర్త రోశయ్య విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ, రాజకీయాలకు అతీతంగా అందరి మన్ననలు పొందారు. ఆమె మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సహా పలు పార్టీల నేతలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు.

చలానా పడగానే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్

మొదటిపేజీ తరువాయి

వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణమవుతున్న తల్లిదండ్రులపైన కేసులు నమోదు చేయాలని, ఇలాంటి వాటిని నివారించడానికి చిన్నతనం నుంచి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అన్నారు. రోడ్డు భద్రతను అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా గుర్తించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ట్రాఫిక్ సమస్యను నియంత్రించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో ఇకనుంచి కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం, సిగ్నల్ వ్యవస్థను బలోపేతం చేసుకోవడం, రవాణా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణను ప్రధాన ఎజెండాగా విధివిధానాలతో నూతన చట్టం తీసుకురావలసిన అవసరం ఉందని చెప్పారు. ఒకప్పుడు శాంతి భద్రతలు ప్రధాన సమస్యగా ఉండేది. ఇప్పుడు ట్రాఫిక్ నియంత్రణ అతిపెద్ద సవాలుగా మారిందని, .ఇప్పుడు అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాల్సిన అవసరం ఉందని అన్నారు. రోడ్డు భద్రత కోసం డీజీ, అదనపు డీజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం గూగుల్ తో అవగాహన ఒప్పందం చేసుకున్నాం. సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసుకోవడమే కాకుండా ఆధునిక సాంకేతిక వ్యవస్థను ఉపయోగించుకుని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం. ప్రతి 3 నిమిషాలకు ఒక ప్రాణాన్ని కోల్పోవడం దురదృష్టకరమని, రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థి దశలోనే ఒక అవగాహన కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయని అన్నారు. డ్రైవింగ్ చేసేప్పుడు మనం తప్పు చేయకపోయినా, ఎదుటివారి తప్పిదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాదాలను ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా చేసిన హత్యలుగా భావించాలని సీఎం అన్నారు. 'సైబర్ క్రైమ్ పెరిగిన నేపథ్యంలో నియంత్రించడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్టు, తీవ్రవాదాన్ని అణిచివేయడానికి కౌంటర్ ఇంటెలిజెన్స్, ఆక్టోపస్ లాంటి సంస్థలను, టెర్రరిస్టు, మిలిటెంట్ కార్యక్రమాలను నియంత్రించడానికి గ్రేహౌండ్స్ వ్యవస్థలను ప్రారంభించి దేశానికి ఆదర్శంగా నిలిచాం. మాదకద్రవ్యాలను నియంత్రించడానికి ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నాం. అలాగే చెరువులు, కుంటల కబ్జాలను నివారించడానికి హైడ్రాను ఏర్పాటు చేసుకున్నాం. అదే తరహాలో ఇప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి' అని అన్నారు. రోడ్డు భద్రతపై ఒక అహగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళికను రూపొందించడాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పోలీసు శాఖను అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ప్రజా ప్రతినిధులు, హోం శాఖ ముఖ్య కార్యదర్శి సీవీ ఆనంద్, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

“

ఆధునిక క్రికెట్‌లో రాహుల్ ఎంఎస్ ధోనీలా ఫినిషర్ పాత్ర పోషిస్తున్నారు. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో హర్షిత్ క్రీజులో ఉన్నప్పుడు నెమ్మదిగా ఆడుతూ సుందర్ వచ్చాక గేర్ మార్చారు. ధోనీ వలే ప్రశాంతంగా ఉంటూ సింగిల్స్ తీస్తూ అవసరమైనప్పుడు భారీ షాట్లు ఆడారు. బౌలింగ్ కాకుండా ఏ రోల్ పోషించేందుకైనా రాహుల్ సిద్ధంగా ఉంటారు.

- మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా

నాణ్యత విషయంలో రాజీపడొద్దు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విద్యార్థులకు అందించనున్న కిట్ పై అధికారులతో సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 12: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్న 22 వస్తువులతో కూడిన కిట్ కు సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ముఖ్యమంత్రి నివాసంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల విద్యార్థులకు అందించే వస్తువులకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ పై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కిట్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల విషయంలో ఖర్చుకు వెనకాడొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీపడొద్దని తెలిపారు. యూనిఫామ్ తో పాటు 21 వస్తువులతో కూడిన కిట్ ను విద్యార్థులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. స్కూల్ బెల్ట్, టై, షూస్, స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, ఇతర వస్తువులను అందించేందుకు అవసరమైన ప్రొక్యూర్మెంట్ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షసమావేశంలో ప్రభుత్వసలహాదారులు సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, సిఎం సెక్రటరీ వేముల శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు

- అందులో భాగంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చాం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 12: ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.మన్రేగా పథకం.. ఇకపై వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ(వీబీజీ రామ్ జీ) పేరుతో కొనసాగనుందని కిషన్ రెడ్డి తెలిపారు. వీబీజీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి. రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.

నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలి

- స్టడీ సర్కిల్లో మరింత మెరుగైన సౌకర్యాల కల్పన
- గ్రూప్ 1 ట్రైనీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 12: ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నూతన ఆలోచనలు చేసి సరికొత్త కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మేలు చేసేలా అత్యంత నిబద్ధతతో ముందుకు వెళ్లాలని గ్రూప్ 1 ట్రైనీలకు సూచించారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన స్థానం నుంచి వచ్చిన మీరు రేపటి రోజున వెనుకబడిన వారికి, సమాజంలో నిలదొక్కుకోవాడినికి ఇబ్బందులు పడుతున్నవారికి తోడ్పాటును అందించాలన్నారు. సోమవారం ప్రజాభవన్లో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్లో శిక్షణ పొంది గ్రూప్ 1 సాధించి శిక్షణపొందుతున్న వారికి మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యంత్రితో పాటు మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ బలరామ్ నాయక్, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టడీ సర్కిల్లో మౌలిక వసతులు ఏవిధంగా మెరుగు పరిచామో అందరికీ తెలుసన్నారు. ఇప్పుడున్న వసతులను మరింతగా మెరుగుపరిచేందుకు వచ్చే ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ భవన్ ముందున్న ఎకరమున్నర స్థలాన్ని బాగు చేపించి, అక్కడ నిరంతరం విద్యాసదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో తట్టుకుని నిలబడి గ్రూప్ 1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం అంతమాషీ కాదన్నారు. ప్రజల క్షేమం కోసం ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

మతసామరస్యానికి ప్రతీక కైట్ ఫెస్టివల్

కైట్ ఫెస్టివల్ మతసామరస్యానికి ప్రత్యేకగా నిలిచిందని డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం సాయంత్రం నెక్లెస్ రోడ్డు సమీపంలోని ఐమాక్స్ సర్కిల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు వేసే ముగ్గులు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చక్కటి సందేశాన్ని ప్రజలకు అందించాయి, ముగ్గుల ద్వారా మహిళల ఆలోచనలతో పాటు విషయ పరిజ్ఞానం బయటికి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అత్యంత పేదరిక నిర్మూలనపై ఫోకస్

- వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే విధంగా గుర్తింపు
- రాష్ట్ర మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క
- స్పష్టమైన ప్రమాణాలు రూపొందించాలని ఆదేశం
- ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 12: గణాంకాల ఆధారంగా కాకుండా, గ్రామీణ స్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే విధంగా పేదరిక గుర్తింపు జరగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. ఇందుకోసం స్పష్టమైన ప్రమాణాలు రూపొందించి, ప్రతి కుటుంబం జీవన స్థితి, ఆదాయ వనరులు, నివాస పరిస్థితులు, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అత్యంత పేద వర్గాల గుర్తింపు, వారి అవసరాల అంచనా, అలాగే విడతల వారీగా పేదరికం నుంచి బయటికి తీసుకొచ్చేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రి సీతక్క రాష్ట్ర సచివాలయంలో సోమవారం శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అత్యంత పేదలను గుర్తించే ప్రక్రియలో మహిళా స్వయం సహాయక బృందాల పాత్ర కీలకమని మంత్రి పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో స్థానిక పరిస్థితులను బాగా తెలిసిన ఈ బృందాల ద్వారా ఇంటింటా సర్వేలు నిర్వహించి, నిజంగా అత్యవసర సహాయం అవసరమైన కుటుంబాలను గుర్తించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అర్హుల గుర్తింపు కోసం విలేజ్ యూనిట్ గా సోషల్ మ్యాపింగ్ జరగాలన్నారు. గ్రామ సభల తరహాలో గ్రామస్తులందరినీ ఒక దగ్గరకు చేర్చి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. అత్యంత పేద కుటుంబాలను గుర్తించిన అనంతరం, వారికి ఉపాధి, నివాసం, ఆరోగ్యం, పోషణ, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో విడతల వారీగా సమగ్ర సహాయం అందించే కార్యాచరణ రూపొందించాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. లక్ష్యం కేవలం సహాయం ఇవ్వడం కాకుండా, ఈ కుటుంబాలను దీర్ఘకాలికంగా స్వయం ఆధారితంగా నిలబెట్టడం కావాలని ఆమె స్పష్టం చేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత పేదలను గుర్తించే ప్రక్రియ విడుదల వారిగా చేపట్టాలని, అత్యంత వెనుక పడ్డ ప్రాంతాలకు తొలుత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా కొన్ని కుటుంబాలకు కావలసిన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నారని, వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. దీనికి సంబంధించి త్వరలో సీఎం నేతృత్వంలో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో పేదరిక నిర్మూలన దిశగా ఒక వ్యవస్థాత్మకమైన, మానవీయమైన మార్గం రూపొందుతుందని మంత్రి సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్. శ్రీధర్, డైరెక్టర్ శృతి ఓజా, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్య దేవ రాజన్ పాల్గొన్నారు.

డీఏ ప్రకటన కంటితుడుపు చర్యే

- తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 12: ఉద్యోగులకు ప్రభుత్వం డీఏ కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనని తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వీరభద్రరావు మండిపడ్డారు. సోమవారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో టీజేటీఎఫ్ కోశాధికారి ఘనపురం దేవేందర్, రాష్ట్ర నాయకులు ఎస్ కే మస్తాన్ తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2023 జులైలో ఇవ్వాల్సిన డీఏ ను ఇప్పుడు ప్రకటించి ఉద్యోగులకు ఏదో చేశామని ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న మిగిలిన డీఏలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఉద్యోగులకు డీఏ ఇవ్వడం వారి హక్కు మాత్రమే తప్ప ఎలాంటి అదనపు ప్రయోజనం కాదు అన్న విషయం గుర్తించాలన్నారు. ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా పై స్పష్టత ఇవ్వాలని, ప్రీమియం ఎవరు చెల్లిస్తారనే విషయం పై క్లారిటీ ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయకుండా, పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వడం లాంటి కీలక సమస్యలను పక్కన పెట్టి ఒక్క డీఏతో సరిపెట్టడం తగదన్నారు. వెంటనే ఉద్యోగుల అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గొప్ప కళా ఖండాల కేంద్రం ఆర్ట్స్ ఎగ్జిబిషన్

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 12: గొప్ప కళా ఖండాల కేంద్రం ఆర్ట్స్ ఎగ్జిబిషన్ అని, కళాకారుల ప్రతిభ శ్లాఘనీయమని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్ గ్యాలరీని చిన్నారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ కళాకారులు దూర దృష్టితో, సూక్ష్మ పరిశీలనతో రూపొందించిన ఆర్ట్ ప్రతి ఒక్కరి హృదయాలను చవిచూస్తుందని పేర్కొన్నారు. గత 84 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఎగ్జిబిషన్ సొసైటీ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ ను నిర్వహిస్తుండడం గొప్ప విషయమని చిన్నారెడ్డి అభినందించారు. కళాకారులు రూపొందించిన ఆర్ట్స్ ను చిన్నారెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు మార్గం అశ్విన్, రంగారెడ్డి, ఆర్ట్ ఎగ్జిబిషన్ కమిటీ కన్వీనర్ దేవులపల్లి హనుమంతరావు, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు ఎం.వీ. రమణారెడ్డి, శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీతో పోల్చదగిన కవి అలిశెట్టి

- పురస్కార ప్రదాన సభలో నారదాసు
- చెమన్ కు అలిశెట్టి అవార్డు ప్రధానం

ప్రతిపక్షం, కరీంనగర్, జనవరి 12: శ్రీశ్రీతో సరితూగే పోల్చదగిన కవి అలిశెట్టి ప్రభాకర్ అని శాసన మండలి మాజీ సభ్యులు నారదాసు లక్ష్మణరావు పేర్కొన్నారు. తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆ దివంగత పాత్రికేయుడు ఫజల్ రెహమాన్ ప్రాంగణం (ఫిలింభవన్)లో జరిగిన అలిశెట్టి ప్రభాకర్ సాహత్య పురస్కార ప్రదాన సభలో ముఖ్య అతిథిగా హజరై ఆయన మాట్లాడారు. అలిశెట్టె మాదిరిగా నేటి కవులు నైతికత, వ్యక్తి శీలతకు ప్రాధాన్యం యివ్వాలని నారదాసు కోరారు. కాగా తెరవే డిమాండు కు స్పందిస్తూ తాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం నెలకొల్పేందుకు తను ప్రయత్నిస్తానని కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు రవి చంద్ర తెలిపారు. ఈ సభకు తెరవే జిల్లా అధ్యక్షుడు సి వి కుమార్ అధ్యక్షత వహించారు. అలిశెట్టిని ఆరాధించిన తనకు ఆయన పేరిట పురస్కారాన్ని పొందడం ఎంతో ఆనందంగా ఉందని డాక్టర్ చెమన్ తెలిపారు. అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, బుర్ర తిరుపతి, దామరకుంట శంకరయ్య, బసవేశ్వర్, నెరువట్ల చైతన్య తదితరులు మాట్లాడారు. తైదల అంజయ్య, ఎమ్ అనిల్, విజయశ్రీ, జలంధర్ రెడ్డి, తప్పెట ఓదయ్య, బాలసాని కొమురయ్య, నరాల వెంకటేశం, తడిగొప్పుల కుమారస్వామి నడిమెట్ల రామయ్య, పి ఎస్ రవీంద్ర ,ఎర్రోజు వెంకటేశ్వర్లు, విలాసాగరం రవీందర్, కనకం శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

మహాకవి అలిశెట్టి ప్రభాకర్‌కు ఘన నివాళులు

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 12: మహాకవి అలిశెట్టి ప్రభాకర్ 72వ జయంతి, 33వ వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద హుస్నాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, శ్రామికుల పెత్తనం ద్వారా సమాజంలోని దోపిడీ నిర్మూలించినప్పుడే సమాన సమాజం సాధ్యమవుతుందని, ఆ భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయడంలో అలిశెట్టి ప్రభాకర్ తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. స్వభావం, సాహసం ఆయనకు ప్రధాన బలాలని పేర్కొన్నారు. పరిష్కారం, ఎర్ర పావురాలు, మంటల జెండాలు, పింజరా, దశ, సిటీ లైఫ్ వంటి రచనల ద్వారా రాజకీయ నాయకుల ద్వంద్వ వైఖరిని, వేశ్యల దుర్భర జీవన పరిస్థితులను, సమాజంలోని అనేక రుగ్మతలను కవిత్వంగా చిత్రీకరించారని తెలిపారు. జగిత్యాలలో మధ్యతరగతి పద్మశాలి కుటుంబంలో జన్మించిన అలిశెట్టి ప్రభాకర్ కవి మాత్రమే కాకుండా చిత్రకారుడు, ఫోటోగ్రాఫర్‌గా కూడా వివిధ వృత్తుల్లో రాణించారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బోలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, కోడం ప్రభాకర్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, కార్యక్రమ కన్వీనర్ గాజుల భగవాన్ నేత, వడ్డేపల్లి వెంకటరమణ, లక్ష్మీపతి, రాజేశం, నోముల బాలయ్య, సతీష్, కిరణ్, అలువోజు రవీందర్, రాజకుమార్, చింతకింది శ్రీనివాస్, పూదరి శ్రీనివాస్, కేశవేణి రమేష్‌తో పాటు పద్మశాలి నాయకులు, అన్ని పార్టీల నాయకులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

జెన్ జీ క్రియేటివిటీతో నిండి ఉంది. వినూత్న ఆలోచనలు, ఉత్సాహంతో జాతి నిర్మాణంలో యువశక్తి ముందంజలో ఉంది. యువతను దృష్టిలో పెట్టుకొని వరుసగా పథకాలను ప్రవేశపెట్టాం. దీంతో దేశంలో స్టార్టప్ విప్లవం ఊపందుకుంది. కల్చర్, కంటెంట్, క్రియేటివిటీతో కూడిన ఆరెంజ్ ఎకానమీలో దేశం అద్భుత వృద్ధి సాధిస్తోంది.

- వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో ప్రధాని మోడీ

ఓపెన్ వాయిస్

నిబంధనల అమలులో వైఫల్యం
కాలుష్య కట్టడి ఎలా?

ముంబై నగర వాయు కాలుష్య సంక్షోభంపై బాంబే హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఏళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడానికి ప్రధాన కారణం డేటా లేకపోవడం, నిబంధనల అమలులో వైఫల్యమేనని స్పష్టమవుతోంది. గాలి నాణ్యత క్షీణతకు, ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పేర్కొనడం అందరి దృష్టిపథంలో ఉంది. అదే సమయంలో అసలు దానికి సంబంధం ఉందో లేదో నిర్ధారించే డేటా సేకరణ మాత్రం జరగలేదు. అది యాధృచ్ఛికమో, లేక నిజంగానే కనెక్షన్ ఉందో తెలీదు కానీ, ప్రభుత్వం 'గాలి కాలుష్యకారకమైన వ్యాధులపై పోరాటానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం..' అని చెబుతూ ఉంటుంది. సెన్సార్లు పనిచేయకపోవడం అన్నది గాలి కాలుష్యం విషయానికి సంబంధించిన ఆందోళనలో ఒక పరిపాటిగా మారిపోయింది. కాలుష్య నియంత్రణ సెన్సార్లు అనేకచోట్ల పని చేయడం లేదని బాంబే హైకోర్టు స్వయంగా గుర్తించింది. నిర్మాణ ప్రాంతాల్లో కాలుష్య నివారణ మార్గదర్శకాలను అమలు చేస్తున్నట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారిక డేటా అంతా బాగున్నట్లు భ్రమింపజేస్తున్నా, జనం అనుభవిస్తున్న కాలుష్యం మాత్రం వేరే కథ చెబుతోంది. జనసాంద్రతకు అనుగుణంగా సెన్సార్ నెట్ వర్క్ లేకపోవడంతో, కోర్టులు కూడా సరైన సమాచారం లేని శూన్య స్థితిలో నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోంది. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో శ్వాస పీల్చడం అంటే రోజుకు పదుల సంఖ్యలో సిగరెట్లు తాగడంతో సమానమని వార్తలు వస్తున్నా, జనం దాన్ని అలవోకగా తీసుకుంటున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యే కాదు, పెరుగుతున్న వైద్య ఖర్చుల వల్ల దేశంపై భారీ ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. అస్పష్టమైన నిబంధనలు, ఆచరణకు సాధ్యం కాని విధానాల వల్ల వాయు స్వచ్ఛత లక్ష్యాలు నెరవేరడం లేదు. ఈ పరిస్థితికి చాలా కారణాలున్నాయి. స్వచ్ఛమైన గాలి కోసం మనం విధించుకునే లక్ష్యాలు వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతుల్యం కూడా అవసరమే. రెండు ప్రధాన లోపాలున్నాయి. ఒకటి డేటా లేకపోవడం.. అదే ముఖ్యమైంది. ఇక రెండోది ప్రత్యక్ష ఆర్థిక ప్రోత్సాహకాలు, జరిమానాలు లేకపోవడం. కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి లోకాలిటీలో తక్కువ ఖర్చుతో కూడిన ఆధునిక సెన్సార్లను ఏర్పాటు చేయాలి. కేవలం ముంబైని మాత్రమే కాకుండా, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ మొత్తాన్ని ఒకే 'ఎయిర్ షెడ్'గా పరిగణించి అధ్యయనం చేయాలి. సముద్రపు గాలుల వల్ల కాలుష్యం ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుతుందో తెలిస్తేనే మూలాలను అరికట్టగలం. వీటితో పాటు, కాలుష్యం తగ్గించే వారికి పన్ను రాయితీలు ఇవ్వడం, ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించడం వంటి 'ఫిస్కల్ ఇన్సెంటివ్స్' విధానాన్ని ప్రవేశ పెట్టాలి. బలమైన రాజకీయ సంకల్పం లేకపోతే, మనం పీల్చే గాలిని చూస్తూ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోతాం. రాజధాని ఢిల్లీని వాయుకాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరోవైపు ప్రపంచానికే పొగమంచు రాజధానిగా పేరుపొందిన చైనా రాజధాని బీజింగ్ గడచిన దశాబ్ద కాలంలో వాయు నాణ్యతను గణనీయ స్థాయిలో మెరుగుపరుచుకుంది. గడచిన వారం రోజులుగా ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ఈ గండం నుంచి గట్టెక్కడానికి చైనీస్ ఎంబసీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న దరిమిలా ఉత్పన్నమయ్యే వాయు కాలుష్యంపైన ఎలా పోరాడాలో భారత్, చైనాకు తెలుసునని చైనీస్ ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ తన పోస్టులో పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి రాత్రికి రాత్రే రాదని, కాని దాన్ని సాధించగలమని ఆమె తెలిపారు. మొదటి దశలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు బీజింగ్ తీసుకున్న చర్యలను ఆమె వివరిస్తూ ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లే పాత వాహనాలను తొలగించి యూరో 6 నిబంధనలను కఠినంగా అమలు చేసినట్లు ఆమె చెప్పారు. లైసెన్స్‌ప్లేట్ లాటరీలు, బేసి, సరి సంఖ్య తేదీల్లో వాహనాలపై ఆంక్షలు, మెట్రో, ప్రజారవాణా వ్యవస్థలో భారీ పెట్టుబడులు పెట్టడం, విద్యుత్తు బస్సులు, వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున తీసుకురావడం వంటి చర్యలను ఆమె సూచించారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
13.01.2026

గద్దెల చెంతకు 'ఎదురు పిల్ల'గా లక్ష్మీదేవర..!
నాయకపోడ్ల అపురూప సంప్రదాయం

ఆదివాసీ సంస్కృతిలో దైవమంటే కేవలం భయం కాదు, అది ఒక ఆత్మీయ అనుబంధం. నాయకపోడ్లు తమ దేవతలను భుజాన మోస్తూ మేడారం అడవుల్లో సాగించే ప్రయాణం, ఆదిమ తెగల ప్రకృతి సహజీవనానికి నిదర్శనం. ఆధునిక కాలంలో భక్తి వ్యాపారీకరణ చెందుతున్నా, నాయకపోడ్లు మాత్రం తమ ప్రాచీన ఆదివాసీ ఆచారాలను రక్షించుకుంటూ వస్తున్నారు. వారు ధరించే ఎరుపు కండువా వీరత్వానికి, త్యాగానికి చిహ్నం కాగా, వారు ఎగరేసే జెండాలు తమ జాతి గౌరవానికి పతాకాలు. గద్దెలపై విగ్రహారాధన లేకపోయినప్పటికీ, ఆ శూన్యంలోనే పరమాత్మను చూసే ఆదివాసీ తత్వం నాయకపోడ్ల ప్రతి అడుగులోనూ కనిపిస్తుంది.

వెంక గారి భూమయ్య
9848559863

ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ మహాజాతర మేడారంలో నాయకపోడ్ల భక్తి భావం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సమ్మక్కసారలమ్మల పట్ల నాయకపోడ్ కులస్తులకు ఉన్న బంధుత్వం, వారు పాటించే ఆచారాలు గిరిజన సంస్కృతికి అద్దం పడుతున్నాయి. ముఖ్యంగా తమ ఆరాధ్య దైవం లక్ష్మీదేవరను సమ్మక్కసారలమ్మల చెంతకు 'ఎదురు పిల్ల' (ఆడబిడ్డ)గా పంపే సంప్రదాయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నాయకపోడ్ల నమ్మకం ప్రకారం.. మేడారం దేవతలు కేవలం దైవాలు మాత్రమే కాదు, తమ కుటుంబ సభ్యులు. పోతురాజును సమ్మక్కకు సొంత తమ్ముడిగా భావిస్తే, లక్ష్మీదేవరను మేడారం అమ్మవార్లకు 'ఆడబిడ్డ'గా లేదా 'ఎదురు పిల్ల'గా పిలుచుకుంటారు. అంటే అమ్మవార్ల చెంతకు వెళ్లే ఈ దేవతను, పుట్టింటికి వస్తున్న ఆడబిడ్డకు ఇచ్చే గౌరవంతో, అత్యంత వాత్సల్యంతో ఎదురేగి ఆహ్వానించడం నాయకపోడ్ల ప్రత్యేక ఆచారం. ఈ జాతర ప్రస్థానం నాయకపోడ్ల గ్రామాల్లో ఎంతో వైభవంగా మొదలవుతుంది. ఊరిలోని పోతురాజు, లక్ష్మీదేవర, భీమన్న, మైసమ్మ, గట్టమ్మల పటాలను మరియు విగ్రహాలను అత్యంత భక్తితో శుద్ధి చేసి, పసుపు, కుంకుమలు మరియు వేప ఆకులతో అలంకరిస్తారు. కులస్తులందరూ తమ ప్రత్యేక వస్త్రాధారణతో, ముఖ్యంగా పురుషులు తెల్లని పంచె మరియు పోతురాజుకు చిహ్నమైన ఎరుపు రంగు కండువా ధరించి, చేతుల్లో దేవర జెండాలు పట్టుకొని మేడారం వైపు సాగుతారు. మేడారం చేరుకున్నాక జంపన్న వాగు తీరాన ప్రత్యేకంగా చెలిమలు తీసి, ఆ పవిత్ర జలంతో స్నానమాచరించి, సమ్మక్కసారలమ్మల గద్దెల దర్శనానికి సిద్ధమవుతారు. తడి బట్టలతోనే గద్దెలను దర్శించుకొని, తమ బరువుకు సమానమైన బెల్లాన్ని 'బంగారం'గా సమర్పించి, ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకోవడం వారి పూర్వీకుల నుండి వస్తున్న అచంచలమైన ఆచారం. ఆదివాసీ సంస్కృతిలో దైవమంటే కేవలం భయం కాదు, అది ఒక ఆత్మీయ అనుబంధం. నాయకపోడ్లు తమ దేవతలను భుజాన మోస్తూ మేడారం అడవుల్లో సాగించే ప్రయాణం, ఆదిమ తెగల ప్రకృతి సహజీవనానికి నిదర్శనం. ఆధునిక కాలంలో భక్తి వ్యాపారీకరణ చెందుతున్నా, నాయకపోడ్లు మాత్రం తమ ప్రాచీన ఆదివాసీ ఆచారాలను రక్షించుకుంటూ వస్తున్నారు. వారు ధరించే ఎరుపు కండువా వీరత్వానికి, త్యాగానికి చిహ్నం కాగా, వారు ఎగరేసే జెండాలు తమ జాతి గౌరవానికి పతాకాలు. గద్దెలపై విగ్రహారాధన లేకపోయినప్పటికీ, ఆ శూన్యంలోనే పరమాత్మను చూసే ఆదివాసీ తత్వం నాయకపోడ్ల ప్రతి అడుగులోనూ కనిపిస్తుంది. తమ పూర్వీకుల ఆత్మలు తమ వెంటే ఉండి నడిపిస్తున్నాయనే నమ్మకంతో, అడవి తల్లే

తమను రక్షిస్తుందనే ధీమాతో ఈ యాత్ర సాగుతుంది. నాయకపోడ్ల ఆచారాల ప్రకారం ఈ ప్రక్రియలో లక్ష్మీదేవరను అమ్మవార్ల గద్దెలపై ప్రతిష్టించరు. వారధిగా పోతురాజు ముందు నడుస్తుండగా, ఆయన వెంటే లక్ష్మీదేవరను భక్తిశ్రద్ధలతో తీసుకువస్తారు. అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకున్నాక, లక్ష్మీదేవరను గద్దెలపై ఉంచకుండా, గద్దెల సమీపంలో నిర్ణీత స్థలంలో ఉంచి, అక్కడ నుండి అమ్మవార్లను దర్శించుకోవడం వీరి ప్రత్యేకత. తమ ఇంటి ఆడబిడ్డను అమ్మవార్ల వద్దకు సాగనంపుతున్నట్లుగా ఈ ప్రక్రియ సాగుతుంది. లక్ష్మీదేవర రాకను గమనించిన భక్తులు గాలిలోకి కోళ్లను ఎగురవేస్తూ, హారతులు ఇస్తూ 'ఎదురుకోలు' నిర్వహిస్తారు. ఈ అపూర్వ ఘట్టం ఆదివాసీల మధ్య ఉన్న సామాజిక ఐక్యతను మరియు దైవత్వంమానవత్వాల మధ్య ఉన్న అనుబంధాన్ని బలపరుస్తుంది. చివరిగా, ఈ 'ఎదురుకోలు' ఉత్సవం గిరిజన తెగల మధ్య ఉన్న సామాజిక సమగ్రతను చాటుతుంది. మేడారంలోని గద్దెల వద్ద లక్ష్మీదేవరను ఉంచకపోయినప్పటికీ, ఆమెను ఆ ప్రాంతం వరకు తీసుకువెళ్లి అమ్మవార్ల దీవెనలు తీసుకోవడం అనేది సోదర భావానికి ప్రతీక. నాయకపోడ్ల ఈ విశిష్ట పూజా విధానం, వారి వేషధారణ, మరియు లక్ష్మీదేవరను 'ఎదురు పిల్ల'గా పిలుచుకునే ఆప్యాయత మేడారం జాతరను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక వేదికగా మారుస్తున్నాయి. అడవి బిడ్డల ఆచారాల్లోని స్వచ్ఛత, వారి నిరాడంబరత ఈ జాతరను చూసే ప్రతి భక్తుడిలోనూ ఒక కొత్త చైతన్యాన్ని, ఆదివాసీ సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయి. ఈ మహా జాతర కేవలం మొక్కులు చెల్లించుకునే వేదిక మాత్రమే కాదు, విడిపోయిన బంధాలను కలుపుకునే ఒక అపూర్వ సమ్మేళనం. మేడారం అడవుల్లో నాయకపోడ్లు ఏర్పాటు చేసుకునే 'దేరాలు' (తాత్కాలిక నివాసాలు) ఒక చిన్నపాటి గ్రామాలను తలపిస్తాయి. రాత్రి వేళల్లో నెగల్లు (మంటలు) వేసుకుని, తమ దైవాల సాక్షిగా కుల పెద్దల సమక్షంలో పాత గాథలను నెమరువేసుకుంటూ, యువతకు తమ పూర్వీకుల వీరత్వ చరిత్రను వివరిస్తారు. ప్లాస్టిక్ రహిత జాతరను నిర్వహించాలని, ప్రకృతికి హాని చేయకూడదని వారు పాటించే స్వీయ నియంత్రణ నేటి సమాజానికి ఆదర్శప్రాయం. ఒకే రంగు కండువాలు, ఒకే విధమైన భక్తి భావంతో వేలాదిగా తరలివచ్చే నాయకపోడ్ల ఐక్యత, మేడారం గడ్డపై ఆదివాసీ అస్తిత్వాన్ని పతాక స్థాయిలో నిలబెడుతుంది. ఈ క్రతువు ద్వారా తమ సంస్కృతిని భావి తరాలకు వారసత్వంగా అందించడమే కాకుండా, అడవి తల్లితో తమకున్న పేగు బంధాన్ని ఈ వేడుక ప్రతి ఏటా పునరుద్ధరిస్తోంది.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

రాజకీయ దురంధరుడు మర్రి చెన్నారెడ్డి

సుధాకర్.ఏ.వి
9000674747

పరిపాలనపై సంపూర్ణ అవగాహన,పూర్తి పట్టు ఉన్న చెన్నారెడ్డి 33 ఏళ్లకే మంత్రి కాగలిగారు.సీఎంగా ఉన్నతాధికార వర్గంపై అదుపు, ప్రభుత్వ ఫైళ్లు,పాలనపై లోతైన అవగాహనతో మర్రి పాలన సాగించారు. అధికారులు చెప్పినట్టు సంతకాలు పెట్టకుండా ఫైళ్ళను క్షుణ్ణంగా చదివి,నోటింగ్ లు రాసి మరీ సంతకం చేసేవారనీ,తనదైన నిర్ణయం తీసుకునేవారనీ ప్రతీతి.అలంకారపూరితమైన గవర్నర్ పదవిలో ఉన్నప్పుడు సైతం మర్రి నిజమైన అధికారాలున్న నేతగా కనిపించడం,రాజకీయ నేతలా మాట్లాడడం చరిత్రలో భాగమే. ఇంతటి విలక్షణ వ్యక్తిత్వం ఉన్న చెన్నారెడ్డి జయంతి నేడు. ఆయన ఆనవాళ్లు తెలుగునాట ఇంకా సజీవంగా నిలిచే ఉన్నాయి. చెన్నారెడ్డి జనవరి 13, 1919న ప్రస్తుత వికారాబాదు జిల్లా వికారాబాదు తాలూకాలోని మార్పల్లి మండలంలోని సిరిపురం గ్రామములో జన్మించాడు. ఇతని తండ్రి మర్రి లక్ష్మారెడ్డి. చెన్నారెడ్డి 1941లో ఎం.బి.బి.ఎస్ డిగ్రీ పొందాడు. తర్వాతి రోజులో వరంగల్ లోని గాంధీ ఆసుపత్రిలో డాక్టర్ గా పనిచేశాడు తర్వాత రోజుల్లో ఆంధ్ర యువజన సమితి, విద్యార్థి కాంగ్రెసును స్థాపించాడు. ఇవే కాక అనేక విద్యార్థి,యువత,విద్యా, అక్షరాస్యత, సాంస్కృతిక సంస్థలలో చురుకుగా పాల్గొనేవాడు.ఇతను హైదరాబాద్ అనే ఒక వారపత్రికకు రెండు సంవత్సరాల పాటు సంపాదకత్వము వహించాడు. అంతే కాక అనేక పత్రికలలో వ్యాసాలు కూడా ప్రచురించాడు. చెన్నారెడ్డి అప్పటి హైదరాబాదు రాష్ట్రములోని స్వాతంత్ర్యోద్యమములో పాల్గొన్నాడు.1942లో ఆంధ్ర మహాసభ ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు.1978 లో కాంగ్రెస్ చీలిక సమయంలో మర్రి చెన్నారెడ్డి శ్రీమతి ఇందిరాగాంధీ వర్గంలో చేరి అప్పటి సమైక్య ఇందిరా కాంగ్రెస్ అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కు నాయకత్వ సారథ్యం వహించి సుమారు 175 నియోజక వర్గాలలో విజయం చేకూర్చి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టినారు. 1950 నుంచి సాఫీగా సాగిన ఆయన రాజకీయ జీవితం 1967 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త మలుపు తిరిగింది. తాండూరులో స్వాతంత్ర్య సమరయోధుడు వందేమాతరం రామచంద్రరావును ఓడించి నాలుగో సారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. వెంటనే కాసు కేబినెట్ లో మరోసారి మంత్రి పదవి చేపట్టాక మర్రి రాజకీయ జీవితంలో ఊహించని మార్పులు మొదలయ్యాయి. అప్పటి ప్రధాని ఇందిర చెన్నారెడ్డిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుని రాజ్యసభకు నామి నేట్ చేశారు. తాండూరు ఎన్నికల ప్రచారంలో చెన్నా రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారంటూ

ఆయన ఎన్నికను సవాలు చేస్తూ రామచంద్రరావు హైకోర్టుకెక్కారు. హైకోర్టు మర్రి ఎన్నిక చెల్లదని తీర్పు ఇస్తూ ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హునిగా ప్రకటించింది. సుప్రీంకోర్టు ఈ తీర్పును సమర్థించడంతో 1968లో చెన్నారెడ్డి కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసి చట్ట సభలకు దూరమయ్యారు. 1956లోనే ఆంధ్రరాష్ట్రంతో తెలంగాణను కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును గట్టిగా వ్యతిరేకించిన నేపథ్యం చెన్నారెడ్డిది. తెలంగాణ ఉద్యమం నడపడానికి వచ్చిన అవకాశంతో ఆయన తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఈ ఉద్యమకాలంలో హైదరాబాద్ లో స్థిరపడిననా కోస్తా, రాయలసీమ జిల్లాలకు చెందిన వారిపై చెదరుమదురుగా మొదలైన దాడులు చెన్నారెడ్డి సకాల జోక్యంతో నిలిచిపోయాయని ఆయనకు పేరొచ్చింది. 1971 లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) తెలంగాణలోని 14 సీట్లలో పది గెలుచుకోవడానికి చెన్నారెడ్డి నాయకత్వం తోడ్పడింది. తెలంగాణ ప్రజల మనోభావాలను గమనించిన ఇందిర పిలుపు మేరకు టీపీఎస్ ను మర్రి కాంగ్రెస్ లో విలీనం చేశారు.1974లో అనర్హతా కాలం ముగిశాక ఇందిర సూచన మేరకు గవర్నర్ పదవి చేపట్టారు.ఇందిర పిలుపు మేరకు యూపీ గవర్నర్ పదవికి రాజీనామా చేసి రాష్ట్ర కాంగ్రెస్ (ఐ) అధ్యక్షుడయ్యారు. మళ్లీ పదేళ్ల తర్వాత మేడ్చల్ నుంచి అసెంబ్లీకి పోటీచేసి గెలిచారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ఐ మెజారిటీ సాధించడంతో ఆయన తొలి సారి సీఎం పదవి సాధించారు. చెన్నారెడ్డి సీఎంగా ఉండగానే హైదరాబాద్ విస్తరణ,అభివృద్ధి వేగం పెరిగింది.ఎవరూ ఊహించని రీతిలో 40 ఏళ్ల క్రితమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు రోజుల పనివారం ప్రవేశపెట్టారు. ఆచరణలో ఈ ప్రయోగం ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో పాత పద్ధతిని పునరుద్ధరించడానికి చెన్నారెడ్డి వెనుకాడలేదు.ఇందిరాగాంధీ ప్రధాని పదవిలో లేనప్పుడు ముఖ్యమంత్రి పదవి చేపట్టడం చెన్నారెడ్డికి ఎక్కువ అధికారం, స్వేచ్ఛ అనుభవించే అవకాశం కల్పించింది.దాంతోపాటు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కి ఆర్థిక వనరులు సమకూర్చే బాధ్యత కూడా మర్రిపైనే పడింది.ఈ నేపథ్యంలో ఆయన సర్కారుపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. గాంధీజీ పిలుపు మేరకు 1935లో ఆంధ్రమహాసభలో పాల్గొన్నారు. అది ఆయన రాజకీయ అరంగేట్రం. కార్యకర్తగా,సమావేశకర్తగా, ఖాదీ ప్రచారకుడుగా, గాంధేయుడుగా,విద్యార్థి నాయకుడుగా, ఆంధ్ర విద్యార్థి కాంగ్రెస్ వ్యవస్థాపకుడుగా అనేక స్థాయిల్లో పనిచేసి అనుభవాన్ని సంపాదించారు.1938లో జైలు శిక్షను అనుభవించారు.డిసెంబర్ 2,1996లో చెన్నారెడ్డి మరణించాడు. ప్రస్తుతం చెన్నారెడ్డి సమాధి హైదరాబాదులోని ఇందిరా పార్కు ఆవరణలో ఉంది.

(జనవరి 13 మర్రి చెన్నారెడ్డి జయంతి)

(వ్యాసకర్త రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు స్టేట్ టీచర్స్ యూనియన్)

అక్షర యోధుడికి 'అక్షర నివాళులు'

జెజెసిపి బాబూరావు
94933 19690

నిఖార్సైన జర్నలిజమే తుదిశ్వాసగా జీవించిన సీనియర్ జర్నలిస్ట్, 'ప్రతిపక్షం' దినపత్రిక వ్యవస్థాపకులు మరియు సంపాదకులు మహమ్మద్ ఫజల్ రహమాన్ హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతూ ఈ నెల 9 నాడు మరణించడం కదు విషాదకరం. ఆయన మరణంతో పత్రికారంగం ఒక సమర్థవంతమైన గొప్ప సంపాదకుడిని కోల్పోయింది. ఆయన మరణం పత్రికా రంగానికి నిలువెల్ల తీరనిలోటు. మహమ్మద్ ఫజల్ రహమాన్ పోరాటాల పురిటిగడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందినవారు. ఆయన ప్రస్తుత సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండల పరిధిలో గల 'అంతకపేట' గ్రామంలో 1960లో జన్మించారు. ఆయన చిన్ననాటి నుండి సమాజాన్ని సునిశితంగా పరిశీలించారు. ఆయన 1980 లో ఆంధ్రప్రభ దినపత్రికలో 'జర్నలిస్ట్ గాను ప్రజా అక్షర ప్రస్థానాన్ని' ప్రారంభించారు. ఆయన అనతి కాలంలోనే అనేక ప్రజా సమస్యలతో పాటు జర్నలిస్టుల సమస్యలను అక్షరీకరించి వెలుగులోకి తీసుకువచ్చి వాటి పరిష్కారాల దిశగా కృషి చేశారు. సామాజిక వెలుగుల ప్రసరణలతో ఆ క్రమంలోనే ఆయన 1990 లో 'హుస్నాబాద్ పబ్లిక్ పాఠశాల'ని ప్రారంభించి ఎంతోమంది భావి పౌరులను తీర్చిదిద్దారు. మహమ్మద్ ఫజల్ రహమాన్ క్రమానుగతంగా ప్రజాతంత్ర, జీవగడ్డ, ఆంధ్రజ్యోతి, దిశ, ముద్ర మొదలైన దినపత్రికలలో వివిధ హోదాలలో నాలుగున్నర దశాబ్దాలకు పైగా సమర్థవంతమైన పాత్రికేయులుగాను పనిచేశారు. ఆ రకంగా ఆయన అనేక పత్రికలలో పనిచేసి జర్నలిజంలో విశేష నైపుణ్యాన్ని పొందాడు. ఆ క్రమంలోనే ఆయన స్వంతంగా 'ప్రతిపక్షం' దినపత్రికని ప్రారంభించి 'సంపాదకులు' గా కొనసాగారు. జర్నలిజంపై ఉన్న మక్కువ మరియు అంకితభావం మూలంగా ఆయన గొప్ప సంపాదకులుగా రాణించారు. తెలుగు నేలలో అనేక దిన పత్రికలు ఉన్ననూ మరొక కొత్త దినపత్రిక అవసరమా ? అని కొందరు పనిగట్టుకొని కుత్సితప్ విమర్శలు చేసిననూ మహమ్మద్ ఫజల్ రహమాన్ వాటన్నింటిని ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకుసాగి ప్రతిపక్షం దినపత్రికని సువిశాల ప్రజరాసులలోకి సమర్థవంతంగా తీసుకెళ్లారు. అనతి కాలంలోనే అశేష పాఠకుల ఆదరాభిమానాలు చూరగొని జర్నలిజంలో సరికొత్త పోకడలు అనుసరించిన ఘనత ఆయనకే చెందుతుంది. 'ప్రజలే కేంద్రంగా, ప్రజా సమస్యలే పరిష్కారంగా' ఆయన సమర్థవంతంగా సంపాదకీయాలు రాశారు. ఇంటర్నెట్ యుగంలోనూ ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ) హవా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో అందుకు అనుగుణంగా



ప్రతిపక్షం దినపత్రికని నిత్యనూతనంగా తీర్చిదిద్దడంలో ఆయన విశేష కృషి చేశారు. హుస్నాబాద్ లో ప్రెస్ క్లబ్ ఆవిర్భావంలోనూ, హుస్నాబాద్ జర్నలిస్టు సంఘం నిర్మాణంలోను మహమ్మద్ ఫజల్ రహమాన్ క్రియాశీల పాత్రని నిర్వహించారు. అలాగే హుస్నాబాద్ యూత్ అసోసియేషన్ నిర్మాణంలోనూ మరియు స్ఫూర్తి అసోసియేషన్ లోనూ ఆయన క్రియాశీలంగా పాల్గొని ఎందరికో మార్గదర్శిగా నిలిచారు. ఎన్నో అవరోధాలు, కష్టాలు ఎదురైననూ మహమ్మద్ ఫజల్ రహమాన్ వాటన్నింటిని అధిగమించి, నిబద్ధతతో పురోగమించి నిజాయితీ గల జర్నలిస్ట్ గాను పేరు ప్రఖ్యాతులు గడించారు. భావి జర్నలిస్టులు మహమ్మద్ ఫజల్ రహమాన్ పాత్రికేయ కృషిని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అంతిమంగా ఆయన జీవితం 'నిజాయితీకి నిలువుటద్దం'గా నిలిచింది. ఉపాధ్యాయుడు గాను, రచయిత గాను, సంపాదకుడు గాను ఇలా విభిన్న రంగాలలో తనదైన శైలిలో విలక్షణ ప్రావీణ్యాన్ని కనబరచి అకాల మరణంతో మనందరి నుండి భౌతికంగా దూరమైన మహమ్మద్ ఫజల్ రహమాన్ గారికి నేను ఈ సందర్భంగా 'అక్షర నివాళులు' అర్పిస్తున్నాను.

(వ్యాసకర్త రీసెర్చ్ స్కాలర్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

క్రాప్ హాలిడే ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలి

- ఎకరాకు 25000 వేల ప్రకటించాలి
- రైతు మహా ధర్నాలో బిఆర్ఎస్ నేతలు.

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 12 ;

మెదక్ జిల్లాలో సింగూరు పర్యాయక ప్రాంత రైతులకు సింగూరు జలాలు ఇవ్వలేని పక్షంలో క్రాప్ హాలిడే ప్రకటించి,ప్రతి పంటకు ఎకరానికి 25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మెదక్ కలెక్టర్ ముందు భారత రాష్ట్రసమితిమెదక్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, సింగూరు నీళ్ల విషయంలో ప్రభుత్వం యొక్క అనాలోచితమైన నిర్ణయం వల్ల తాగునీటి సమస్య ఏర్పడుతుందనీ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో ఇరిగేషన్ సలహా మండలి సమావేశం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించడం జరిగిందని ఇట్టి సమావేశంలో కలెక్టర్కు సింగూరు నుండి నీటిని వదలాలని కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఆయన స్పందించకపోవడంతో అట్టి సమావేశాన్ని బహిష్కరిణించడం జరిగిందని ఆమె తెలిపారు .రైతులు నార్లు పోసుకున్నారు. కొందరు రైతులు నాట్లు కూడా వేసుకున్నారనీ ఇప్పుడు నీళ్లు ఇవ్వం అని అధికారులు చెబుతున్నారు ఆమె విమర్శించారు
ఇక్కడి పాలకులు రైతులపై కక్ష్య సాధింపు చర్యలు చేపడుతున్నారనీ ఆమె తెలిపారు. గత పాలనలో భగీరథ ద్వార సాగునీటికి తాగు నీటికి నీరూ అందించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వమిచ్చిన 6 గ్యారంటీ పథకాలకు దిక్కులేదు ప్రభుత్వం ప్రజలను రైతులను మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కుతుందని సింగూరు నీళ్లు ఘనపూర్ ఆయకట్టు కింద రైతులకు నీళ్లు ఇవ్వాలని లేదంటే క్రాఫ్ హాలీడ్ ప్రకటించి రైతులకు ఎకరాకు రూ 25వేల పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కృష్ణ జలాలను ఆంధ్ర ప్రాంతానికి అప్పనంగా అప్పగించేందుకు సీఎం కుట్ర చేస్తున్నారని సింగూరు నీళ్ల విషయంలో రైతులను ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు సింగూర్ డ్యాం మరమత్తుల కోసం రోడ్డు సంవత్సరాల క్రితం రిపేర్ చేస్తే రైతులు ఇబ్బంది పడేవారు కాదని నేడు వరి నాటు వేసిన తర్వాత నీరు వదలడం అనడం పద్మ దేవేందర్ రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లాకు సాగునీటికి తాగునీటికి నీరు ఇవ్వాల్సిందేనని పర్యాయక ప్రాంతానికి సంబంధించిన 40,000 ఎకరాల భూమి లో ఉంటుందని ఆమె తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సింగూర్ డ్యాం పైన గాని రైతుల సమస్యపై అవగాహన లేదని ఆమె అన్నారు. ఎమ్మెల్యే ముఖ్యమంత్రితో మాట్లాడి నష్టపరిహారం రైతులకు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వంలో యూరియా కోసం చెప్పులు పెడుతున్నారని రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని ప్రజలు ఎండగట్టాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారనీ తెలిపారు. రైతు సమస్యల పైన ముఖ్యమంత్రికి స్థానిక ఎమ్మెల్యేకు ఎలాంటి అవగాహన లేదని ఆమె తీవ్రంగా విమర్శించారు. మంజీరా పర్యాక ప్రాంత రైతులు ముఖ్యమంత్రి కి కార్డు లెటర్ ద్వారా పోస్ట్ కార్డు రాసి సమస్యలను తెలిసే విధంగా పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రైతులతో కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ గా వెళ్లారు కలెక్టర్ కార్యాలయం ముందు బటాయించే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ కు వినతిపత్రం సమర్పించారు. మహా ధర్నా కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ పట్టణ కమిటీ నాయకులు ఆంజనేయులు కృష్ణగౌడ్. మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్. జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి. మాజీ రైతు సమన్వయ సమితి చైర్మన్ సోములు మెదక్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ స్వామి నాయక్ కార్యకర్తలు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు

నలభై వసంతాల 'మరసం' సభలను ఘనంగా నిర్వహిస్తాం..

- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 5 సాహిత్య సభలు..
- హైదరాబాద్ లో గొప్పగా వార్షికోత్సవ సభ..
- సమకాలీన సాహిత్య అంశాల పై సమగ్ర చర్చలు
- పలు సాహిత్య పుస్తకాల ప్రచురణ.
- సిద్దిపేట జిల్లాను రద్దు చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలి
- మరసం సమావేశం లో నిర్ణయం..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి, 12:

మంజీరా నది ప్రవాహంలా సాహిత్య సృజన చేస్తూ సాహిత్య ప్రపంచం లో తనంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న "మంజీరా రచయితల సంఘం " నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్నది.మరసం ఆవిర్భవించి వచ్చే జులై 20 తేదీకి నలభై ఏండ్లు పూర్తి అవుతున్న నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సాహిత్య సభలు నిర్వహించాలని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు, కవులు రచయితలు నిర్ణయించారు.మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె. రంగాచారి అధ్యక్షతన సోమవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సమావేశం జరిగింది.సమావేశనికి మరసం వ్యవస్థాపకులు,తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్, ప్రఖ్యాత కవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డి, మరసం పూర్వ అధ్యక్షులు, కవి, రచయిత, గాయకుడు. శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, మరసం వ్యవస్థాపక ప్రతినిధి టి ఎన్ జీ ఓ సంఘం మాజీ నేత దేవిప్రసాద్, టీ జాక్ చైర్మన్ జీ. పాపయ్య, టీ పి టి ఎఫ్ రాష్ట్ర నాయకులుజీ . తిరుపతి రెడ్డి, మరసం ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి,మరసం ప్రతినిధి రచయిత నందిని భగవాన్ రెడ్డి, ప్రముఖ కవి తైదల అంజయ్య, మరసం పూర్వ అధ్యక్షులు తోట అశోక్, అలాజ్ పూర్ కిషన్,మరసం ఉపాధ్యక్షులు అలాజ్ పూర్ శ్రీనివాస్, మరసం ప్రతినిధులు మామిండ్ల లక్ష్మారెడ్డి, కుమార్, చెన్న రాజు తదితరులు హాజరై మాట్లాడారు. మెదక్ జిల్లా కేంద్రం గా నలభై ఏళ్ల క్రితం ఏర్పడ్డ మంజీరా రచయితల సంఘం అప్రతిహతంగా సాహిత్య సృజన చేస్తూ మంజీరా నది ప్రవాహం లా ముందుకు సాగుతుందంని తెలిపారు. అనేక సమాజిక పరిణామాలను శాస్త్రీయ కోణం లో అర్థం చేసుకొని ఆకలింపు చేసుకొని మంజీరా కవులు రచనలు చేశారని చెప్పారు.ఇప్పటి వరకు సుమారు 50 కి పైగా పుస్తకాలను మరసం ప్రచురించిందని తెలిపారు.సాహిత్యం లోని అన్ని ప్రక్రియల్లో మరసం కవులు రచనలు చేశారని తెలిపారు..మానవ జీవితాన్ని, మానవ సంబంధాల, సామాజిక సమస్యలను, రుగ్మతల పై మరసం కవులు రచనలు చేశారని చెప్పారు. గత నలభై ఏళ్లల్లో ఉమ్మడి మెదక్ జిల్లా లో జరిగిన అనేక ప్రజాఉద్యమాల్లో... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం జరిగిన ఉద్యమం లో మరసం కవులు, రచయిత లు కీలక పాత్ర పోషించారని తెలిపారు..ఈ నేపథ్యంలో జరుగుతున్న మరసం నలభై ఏళ్ల సాహిత్య సభలను ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు మరసం ప్రతినిధులు తెలిపారు. సమకాలీన సాహిత్య ధోరణులు, తెలంగాణ అస్తిత్వం సాహిత్యం, మానవ విలువలు సాహిత్యం.. రాజ్యాంగ విలువలు సాహిత్యం అనే అంశాల ప్రాతిపదికన మరసం నలభై ఏళ్ల సాహిత్య సభలు జరుగుతాయని తెలిపారు.ఈ సందర్బంగా సిద్దిపేట, దుబ్బాక, మెదక్, సంగారెడ్డి, గజ్వెల్, హైదరాబాద్ లలలో ఘనంగా సభలు నిర్వహించాలని నిర్ణయించినట్టు మరసం ప్రతినిధులు తెలిపారు. జులై 19,20 సిద్దిపేట లో.. ఆగస్టు 8,9 తేదీల్లో హైదరాబాద్ లో సభలు నిర్వహించాలని ఆ మధ్య కాలం లో ఇతరచోట్ల సభలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సభల్లో సుమారు పది సాహిత్య పుస్తకాలను ప్రచురించి ఆవిష్కరించాలని నిర్ణయించామన్నారు. వివిధ అంశాలపై జరిగే ఈ సాహిత్య సభలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రం లో ఉన్న ప్రముఖ కవులను, రచయితలను ఆహ్వానించనున్నట్టు తెలిపారు. యువ రచయితలతో ప్రత్యేక సభలను జరుపుతామని చెప్పారు.సభలకు కవులు, రచయితలు పెద్ద సంఖ్య లో హాజరు కావాలని మరసం ప్రతినిధులు కోరారు.

సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తే మహోద్యమం తప్పదు..

రాష్ట్ర ప్రభుత్వం సిద్దిపేట జిల్లా రద్దు ఆలోచనను విరమించుకోవాలని మంజీరా రచయితల సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పలుజిల్లాలను రద్దు చేస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయని అందులో సిద్దిపేట జిల్లా కూడా ఉన్నట్టు మీడియా లో వస్తున్నదని ఇది ఆందోళనకు గురి చేస్తున్నదని తెలిపారు.. సిద్దిపేట ప్రజల 40 సంవత్సరాల ఆకాంక్షలకు అనుగుణంగా సిద్దిపేట జిల్లా ఏర్పడిందని ఈ జిల్లా ఏర్పడదం వల్ల సిద్దిపేట ప్రాంత ప్రజల అనేక కష్టాలు తీరాయని తెలిపారు.. సిద్దిపేట జిల్లా ను రద్దు చేసే ఆలోచన అవివేకమైనదని అన్నారు. జిల్లా ను రద్దు చేస్తే ఈ ప్రాంత కవులుగా, రచయితలుగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని చెప్పారు.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ ఆలోచనను విరమించుకోవాలని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు.

యువతకు దిక్సూచి వివేకానందుడు..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 12:

యువతకు దిక్సూచి స్వామి వివేకానందుడు అని ఆయన చూపిన మార్గములో యువత పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారము స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని సిద్దిపేటలో ఉన్న ఆయన విగ్రహానికి ట్రస్మా నాయకులు యల్లా భాస్కర్ రెడ్డి, బలనగరాజు, చిన్న, మోహన్ కుమార్, ఎం.వి ఐ శంకర్ నారాయణ , ఎ.ఎం.వి ఐ శ్రీకాంత్ రెడ్డి లు కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎం.వి ఐ శంకర్ నారాయణ మాట్లాడుతూ... వివేకానందుని స్పూర్తి తీసుకొని యువత ముందుకు సాగాలనిపిలుపు నిచ్చారు

తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న మంత్రి వివేక్..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 12:

ఈనెల 13మంగళవారం రోజున సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి ,జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభిస్తారని అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమీక్ష మందిరంలో ప్రజావాణి కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి జిల్లాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారని దానిలో భాగంగా మధ్యాహ్నం 2:00 గంటలకు ఐడిఓసి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభిస్తారని అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్డిఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారుల తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి..

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 12:

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 116 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

నైపుణ్య యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు

ప్రతిపక్షం,మిడిదొడ్డి జనవరి 12

మిరుదొడ్డి మండల కేంద్రంలో నైపుణ్య యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభ అధ్యక్షులుగా పసులాకాడి రమేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలకు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాస రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని, ఖ్యాతిని, విశిష్టతను అంతర్జాతీయ వేదికపై ప్రపంచానికి చాటిన ఆధ్యాత్మిక వేత్త. అని కొనియాడారు . ఎందరినో సమాజ సేవకు అంకితం చేసిన తత్వవేత్త.. తన ప్రసంగాలు, బోధనలతో యువతకు ప్రేరణగా నిలిచిన స్ఫూర్తిప్రదాత అని వారు కొనియాడారు. ఈ సమావేశంలో నైపుణ్య యూత్ ఆర్గనైజేషన్ చైర్మన్ మొగుళ్ళ ఐలయ్య కొండల్ రెడ్డి,దశరథం తదితరులు పాల్గొన్నారు.

నాచగిరి క్షేత్ర గిరిప్రదక్షిణతో ఆధ్యాత్మిక అనుభూతి

- దైవన్నామ స్మరణతో మార్మోగిన నాచగిరి కొండలు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 12:

ప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్ర గిరి ప్రదక్షిణతో ఆధ్యాత్మిక అనుభూతి దక్కుతుందని గురు మదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ ఉద్బోధించారు. సోమవారం తెల్లవారు జామున నాచగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ప్రారంభించగా, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ నాచగిరి, శ్వేతగిరి కొండలు ఎంతో పవిత్రమైనవని,శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని వైకుంఠ ద్వారం నుండి గిరి ప్రదక్షిణ చేయడం పుణ్యకార్యం కాగా, చక్కటి ఫలితాలు ఇస్తుందని చెప్పారు. మానసిక ప్రశాంతత కోసం భగవన్నామ స్మరణ దోహదపడుతుండగా, లోక కళ్యాణార్థం చేపట్టిన ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు. భగవంతుని పై భక్తి, సేవాభావం, మనో నిగ్రహం, దాతృత్వం, ధర్మబద్ధమైన జీవనం తదితర మానవుడిని సన్మార్గంలో నడిపిస్తాయని, పుణ్యక్షేత్రాలు, పురాతన ఆలయాలు, గోసంపద తదితర రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని వివరించారు. కార్యక్రమంలో వందలాదిమంది భక్తులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్సరీని సమర్ధవంతంగా నిర్వహించాలి!

ప్రతిపక్షం,తొగుట, జనవరి 12:

గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండలంలోని వెంకట్రావుపేట సర్పంచ్ బండారు కవిత స్వామిగౌడ్ కోరారు. గ్రామంలోని నర్సరీలో కొత్త సంవత్సరంలో పనులను పాలకవర్గంతో కలిసి ఆమె ప్రారంభించారు. నర్సరీలో ప్రజలకు భవిష్యత్తులో ఉపయోగపడే మొక్కలు పెంచాలని, సమర్ధవంతంగా నిర్వహించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లచ్చోల్ల లింగం, కార్యదర్శి రవి, వార్డు సభ్యులు పిట్ల వెంకటేష్, ఎండీ జహంగీర్, ఎంగలి నరేందర్, గ్రామ పెద్దలు పులిగారి శివయ్య, పిట్ల వెంకటయ్య, జీడిపల్లి గోవర్ధన్ రెడ్డి, ఎర్రోల్ల చంద్రం, కత్తుల రమేష్, పర్శరాములు, పులిగారి నర్సింహులు, వడ్డె నర్సింహులు, బాలేష్, స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ కల్లెపు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ప్రేరణాత్మకం స్వామి వివేకానంద జన్మదినం

- యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దేశబోయిని

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 12:

స్వామి వివేకానంద జయంతి యువతకు అత్యంత ప్రత్యేకమైన ప్రేరణాత్మకమైన దినమని యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు అన్నారు. సోమవారం నాడు స్థానిక యువజన ప్రతినిధులతో కలిసి స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేచిరండి... మేల్కొనండి... లక్ష్యాన్ని చేరే వరకు ఆగవద్దు అన్న వివేకానందుని సందేశం నేటికీ యువతకు మార్గదర్శకంగా నిలుస్తోందని గుర్తు చేశారు. విద్య అనేది ఉపాధి కోసం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, మానవ విలువల అభివృద్ధికి ఉపయోగపడాలని స్వామీజీ బోధించారని వివరించారు. శారీరకంగా, మానసికంగా, నైతికంగా బలమైన యువతే బలమైన భారతదేశాన్ని నిర్మించగలదని ఆయన నమ్మకం అని తెలిపారు. దేశంలోని యువత అంతా స్వామి వివేకానంద ఆశయాలు, సిద్ధాంతాలను తమ జీవితాల్లో ఆచరణలో పెట్టాలని, సమాజ సేవ, పేదల అభ్యున్నతి, జాతీయ సమైక్యతకు యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు డా. నరేష్ బాబు, యువజనప్రతినిధులు పాల్గొన్నారు.

చర్చలకైనా, యుద్ధానికైనా తాము సిద్ధం. దేశంలో పరిస్థితి అదుపులోకి వచ్చింది. హింసకు మొస్సాద్ కారణం. మరోవైపు ప్రభుత్వ అనుకూల ర్యాలీల కోసం వేలమందిని రంగంలోకి దించినట్లు అంతర్జాతీయ మీడియా చెప్పింది. టెహ్రాన్‌తోపాటు ఇతర ప్రధాన సిటీల్లోనూ ప్రదర్శనలు చేస్తున్నట్లు తెలిపింది.

- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ

ప్రాంతీయం

డీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ చిట్యాల కార్తీక్‌ను సన్మానించిన డిసిసి అధ్యక్షురాలు ఆంక్షలు రెడ్డి

సిద్ధిపేట, జనవరి 12:

ఇటీవల నూతనంగా నియమితులైన డీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ చిట్యాల కార్తీక్ సోమవారం డీసీసీ సిద్దిపేట అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డిని మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి గా చిట్యాల కార్తీక్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కార్తీక్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం తనవంతు పూర్తి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకులు ఎమ్.డీ సమీర్, ఎమ్.డీ ఆఫ్సర్ లు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులందరూ హాజరు కావాలి

- స్పష్టం చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- గైర్హాజర్ అయిన వారికి మెమోలు జారీ చేయాలని ఆదేశం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 12 :

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావిలతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 84 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. అయితే ప్రజావాణి కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజర్ అయ్యారు. దీనిని గమనించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రజావాణి వినతుల స్వీకరణ పూర్తయిన అనంతరం ఒక్కో శాఖ వారీగా అధికారుల హాజరు జాబితాను పరిశీలించారు. ముందస్తు సమాచారం అందించకుండా పలు శాఖల అధికారులు ప్రజావాణికి గైర్హాజరు కావడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సదరు అధికారులకు షోకాజ్ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఇది మొదటి తప్పుగా భావించి, మెమోలతోనే సరిపెడుతున్నామని, ఇక నుండి గైర్హాజర్ అయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రులలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళలో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన పెంపొందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 12 :

రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తూ, ప్రమాదాల బారిన పడకుండా స్వీయ జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన అధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన పలు వీడియోలను ప్రదర్శిస్తూ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర్ రావు అవగాహన కల్పించారు. జిల్లాలో 2024 సంవత్సరంలో 856 ప్రమాదాలు చోటుచేసుకుని 351 మంది మృతి చెందగా, 2025 నవంబర్ మాసాంతానికి 815 రోడ్డు దుర్ఘటనల్లో 280 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. అతి వేగం, తాగి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులకు, వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన పెంపొందేలా విరివిగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎం.వీ.ఐ కిరణ్ కుమార్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

యువత సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 12 :

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, విజ్ఞానం, నైపుణ్యాలు పెంపొందించుకుంటూ సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ గుప్తా పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని 28వ డివిజన్ గాజులపెట్ లోని స్వామి వివేకానంద విగ్రహానికి, అలాగే 10వ డివిజన్ నాగారంలోని స్వామి వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి శ్రద్ధాభక్తులతో స్మరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి వివేకానంద భారత జాతికి ఆత్మగౌరవాన్ని, యువతకు ఆత్మవిశ్వాసాన్ని అందించిన మహా యోగి, తత్త్వవేత్త అని కొనియాడారు. భారతదేశ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మహనీయుడిగా ఆయనను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వామి వివేకానంద ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

"లేచిపోండి - మేల్కొండి - లక్ష్య సాధన వరకు ఆగకండి" అనే ఆయన సందేశం నేటికీ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని, ఆ మాటలను ఆచరణలో పెట్టినప్పుడే వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా సమాజం కూడా ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక 28 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఇల్లేందుల మమతా, ప్రభాకర్, బీజేపీ నాయకులు నాగరాజు, మఠం పవన్, నారాయణ యాదవ్, పుట్ట వీరేందర్, గట్ల గంగాధర్,, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వివేకానందకు నివాళులు అర్పించారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- రాముడేమైనా బీజేపీలో సభ్యత్వం
- రాముడు పేరు చెప్పి ఓట్లు అడిగే హక్కు ఎవరిచ్చారు
- పీసీసీ చీఫ్ మహేశ్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 12 :

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలో విలేకరులతో మాట్లాడారు.

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, నిజామాబాద్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుంటామని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని కాంగ్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాలో అధిక సంఖ్యలో స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందన్నారు. 10 సంవత్సరాలలో బీఆర్ఎస్ పాలనలో విధ్వంసమైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత రెండేళ్లుగా సీఎం రేవంత్ రెడ్డి బాగు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున పార్టీ కార్యకర్తలకు బీ ఫారం ఇచ్చే విషయంలో ఎలాంటి పక్షపాత ధోరణి ఉండదని, పార్టీలో కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలు కోరుకునే వారికే టికెట్ ఇస్తామని స్పష్టం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎక్కడ ఇవ్వడం లేదని కానీ, తెలంగాణ లో ప్రతి రేషన్‌కార్డుదారుడికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఇల్లు లేని పేదవారు ఉండవద్దనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. ఎన్నడూ లేనంత అభివృద్ధి కాంగ్రెస్ హయాంలో జరిగినందున మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం సీట్లు గెల్చుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ మంత్రిగా ఉన్న కేటీఆర్ రూ.10వేల కోట్ల పెట్టుబడులు కూడా తేలేదని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. రేవంత్ సీఎం అయ్యాక దావోస్ కు వెళ్ళి రూ. లక్షా 70 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారన్నారు. రూ. 5లక్షల కోట్లకు పైగా గ్లోబల్ సమ్మిట్ ద్వారా పెట్టుబడులు పెట్టేలా ఒప్పందం చేసుకున్నామని ఆయన వివరించారు. ఉద్యోగాలిస్తామని మూడవ సారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారని మహేష్ గౌడ్ విమర్శించారు. దేవుడి పేరిట కాకుండా 12ఏళ్లలో చేసిన అభివృద్ధి గురించి చెప్పి బీజేపీ ఓట్లు అడగాలని ఆయన సూచించారు. దేశంలో నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తారనుకుంటే పేర్లు మార్చడానికే మోదీ పరిమితమయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల జీవన స్థితిగతులు మార్చాలి కాని పేర్లుకాదని ఆయన సూచించారు. మార్చవలసింది పేర్లు కాదు పేదల బతుకుల బాగు .. నిజామాబాద్ పేరును ఇందూరుగా మారుస్తామంటున్న ఎంపీ అర్వింద్ ఏడేళ్లలో జిల్లాకు ఏం చేశారో చెప్పాలని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఎంపీ గడిచిన ఏడు సంవత్సరాల లో జిల్లాకు ఏమి అభివృద్ధి చేశారు తెలపాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల ఇచ్చేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. 42శాతం రిజర్వేషన్లు తేలాకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలిపారు. బీజేపీనే బీసీలకు న్యాయం చేయకుండా అడ్డుపడుతోందనిపారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాజీ లేకుండా నిజామాబాద్ అభివృద్ధి కోసం పని చేస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన వచ్చినా, కవిత పార్టీ పెట్టినా స్వాగతిస్తామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కథ ముగిసిపోయిందన్నారు. కవిత విమర్శలకు హరీష్ , కేటీఆర్ వద్ద జవాబులున్నాయా అని ప్రశ్నించారు. శ్రీరాముడిని వాడుకునే హక్కు బీజేపీకి ఎవరిచ్చారు... అందరికీ దేవుడైన శ్రీరాముడిని వాడుకునే హక్కు బీజేపీకి ఎవరిచ్చారని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. రాముడేమైనా బీజేపీలో సభ్యత్వం తీసుకున్నారా కులం, మతం పేరిట బీజేపీ ఎన్నికల్లో రాజకీయాలు చేస్తోందని పీసీసీ చీఫ్ విమర్శించారు. ఎన్నికలొస్తే చాలు దేవుళ్ల పేరు చెప్పుకుంటూ తిరుగుతారని పేర్కొన్నారు. ఎన్నికలు రాగానే బీజేపీ మతం పేరిట రాముడి పేరిట ఓట్లడుగుతూ లబ్ది పొందాలనుకోవడం శోచనీయనన్నారు. దేవుడి పేరిట ఓట్లడిగే వారికి ప్రజలు బుద్ది చెప్పాలన్నారు. దేవుడి పేరిట కాకుండా 12ఏళ్లలో చేసిన అభివృద్ధి గురించి చెప్పి బీజేపీ ఓట్లు అడగాలని సలహా ఇచ్చారు. ఈ సమావేశంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, నుడా ఛైర్మన్ కేశ వేణు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పీ సీ సీ ప్రధాన కార్యదర్శి రాం భూపాల్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, సీనియర్ నాయకులు దాసరి నర్సింలు, నరాల రత్నాకర్, వినయ్ రెడ్డి, జావిద్, శేఖర్ గౌడ్, ఎండల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులంతా కలిస్తే నిజామాబాద్ కు ముడి వేయొచ్చు

- వచ్చే ఎన్నికలో మున్నూరు కాపు వర్గానికి టికెట్ ఇవ్వాలి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 11 :

మున్నూరు కాపులంతా ఐక్యత ప్రదర్శిస్తే నిజామాబాద్ కు ముడి వేయవచ్చని నిజామాబాద్ మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ అన్నారు. నగరంలోని ప్రగతి నగర్ మున్నూరు కాపు సంఘం లో ఇటీవల సర్పంచ్ ఎన్నికలలో గెలిచిన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు మెంబర్లను సంజయ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ జిల్లాలో 60 మంది సర్పంచులు, 67 మంది ఉపసర్పంచ్ లు, 474 మంది వాడు మెంబర్లుగా గెలుపొందడం గొప్ప విషయం అన్నారు. ఇలా మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులను ఒక వేదికపై తీసుకువచ్చి సన్మానించిన సంఘటనలు లేవన్నారు. ఈ సన్మాన సభకు మీ అందరిని స్వయంగా కలిసి ఆహ్వానించేందుకు తగిన సమయం లేకపోవడంతో తాను పంపిన వాట్సాప్ సమాచారంతో మీరంతా ఇక్కడికి రావడం మనలోని ఐక్యతను మరోసారి రుజువు చేసిందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, మునుముందు మరెన్నో కార్యక్రమాలు నిర్వహించి మనమంతా ఐక్యతగా ఉంటే వచ్చే ఎన్నికలలో మన వర్గానికి చెందిన వారికి టికెట్ ఎలా రాదో చూస్తామన్నారు. మునుక వర్గం చెందిన గొప్ప వ్యక్తులు ఈ జిల్లాను పరిపాలించారు. గత ఎన్నికల్లో ముందు కాపు వర్గం చెందిన వారికి ఒక్క సీటు ఇవ్వలేదని ఇప్పుడు కచ్చితంగా టికెట్ ఇవ్వాలని కోరారు. జిల్లాలో వివిధ మండలాల్లో వివిధ గ్రామాలలో ఉన్న మున్నూరు కాపులకు ఎప్పుడు ఏ ఆపద వచ్చిన ఇక్కడ మేమున్న మన సంగతి మరవద్దన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందాన్ మాట్లాడుతూ గతంలో నిజామాబాద్ జిల్లాలో మున్నూరు కాపులలో ఐక్యత కొద్దిగా ఉండేది అన్నారు. సంజయ్ మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడు అయ్యాక వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ మున్నూరు కాపులను ఏకతాటి పైకి తీసుకు రావటం గొప్ప విషయం అన్నారు. నిజామాబాద్ చరిత్రను తిరగరాసేందుకు సంజయ్ జిల్లా అధ్యక్షుడిగా చేతిలోకి తీసుకున్నారు. మీరంతా ఆయనకు సపోటా గా ఉండాలన్నారు. మున్నూరు కాపులంతా ఐక్యంగా కలిసికట్టుగా ముందుకు నడుస్తే రాబోయే రోజుల్లో మీకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ఈ జిల్లా, సంఘం అభివృద్ధి ఉంటుందన్నారు. నాడు అర్గుల్ రాజారాం మున్నూరు కాపుల అభివృద్ధి గురించి చేసిన ఆలోచన డి శ్రీనివాస్ అమలు పరిచారని తెలిపారు. గెలిచిన 68 మంది సర్పంచ్ లు ఐక్యమత్యంగా ఉంటే సాధించినది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ మేయర్ ఆఫర్ సుజాత,ధర్మపురి సురేందర్, శరత్కుమార్, బంటు బలరాం, మాజీ కార్పొరేటర్లు కులచారి వెంకటేశ్వర్, దారం సాయిలు, తోట రాజశేఖర్, బంటు బలవర్ధి, ఆకుల చిన్న రాజేశ్వర్, రామ్మూర్తి గంగాధర్, కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్, ఒక సర్పంచులు వార్డు మెంబర్లు మున్నూరు కాపు పెద్దలు పాల్గొన్నారు.

నుడా మాజీ ఛైర్మెన్ ప్రభాకర్ రెడ్డికి పరమార్శ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 12 :

నిజామాబాద్ నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి ను మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మాజీ ఎమ్మెల్సీ వీ జీ గౌడ్ లు పరామర్శించారు. ప్రభాకర్ రెడ్డి తండ్రి ఇటీవల మరిన్ని చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు.

ఘనంగా వివేకానంద స్వామి జయంతి

ఉత్తమ సేవకుడు వామన్ రావుకు సన్మానం

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి:

యువతకు స్ఫూర్తి దాత, ప్రపంచంలో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసిన స్వామి వివేకానంద 163వ జయంతిని నెహ్రూ యూత్ క్లబ్ అధ్యక్షులు ఆన్కారి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తాలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి ముఖ్యఅతిథి సిఐ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సర్పంచ్ శ్రీమతి హసీనాబాను, ఉప సర్పంచ్ తుంగల శ్రీజ, మాజీ ఎంపీపీ రాణి బాయి, సీనియర్ నాయకుడు వామన్ రావు జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం పూలమాలలు వేసారు. అనంతరం 73 సంవత్సరాల వయసులో నిత్యం ప్రజా సేవలో అలుపు లేకుండా పరిశ్రమిస్తున్న ప్రముఖ నాయకుడు ఏనమండ్ర వామన్ రావును ప్రముఖులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్బర్ ఖాన్, కలికోట వరప్రసాద్, టియుఎఫ్ నాయకుడు ఎండి అయ్యోబుద్దిన్, సట్ల సత్య నారాయణ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అడప రాజయ్య, డాక్టర్ హబీబ్, కేదారి ప్రవీణ్, జాడిగట్టయ్య, కోల అశోక్, పోత రమేష్, దేవేందర్, శ్రీనివాస్, నరసింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శప్రాయులు స్వామి వివేకానంద

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 12 :

స్వామి వివేకానంద 164వ జయంతి సందర్భముగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు గాజులపేటలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు ఆదర్శప్రాయులని, వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. వివేకానందుని సాహిత్యం అధ్యయనం చేసి అనుసరించిన విద్యార్థులు, యువతీ, యువకులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శవంతంగా నిలుస్తున్నారన్నారు. ఈ రోజుల్లో యువత చాలా తొందరగా మనో వ్యాకులత (డిప్రెషన్) కు లోను అవుతున్నారని అన్నారు. నేటితరం విద్యార్థులు మరియు యువత చిన్న విషయాలకే కృంగిపోయి ఒత్తిడికి గురై హైరానా పడుతున్నారన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డల చేత వివేకానంద సాహిత్యాన్ని చదివిస్తే వాళ్ళ లోపల ఆత్మస్థైర్యం పెరిగి మనోవ్యాకులత తగ్గి జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారని నరాల సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, తోట రాజశేఖర్, బగ్గలి అజయ్, రేఖ, బాలన్న, సదానంద్ సత్యనారాయణ, రాజేష్, శ్రీకాంత్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

ప్రతిపక్షం మంచిర్యాల జనవరి 12

వివేకానందుని జీవితం నేటి యువతకు మానవాళికి స్ఫూర్తిదాయకమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరవెల్లి రఘునాథ్ రావు తెలిపారు మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్ లోగల స్వామి వివేకానంద ని విగ్రహానికి వివేకానందుని జన్మదిన వేడుక సందర్భంగా సోమవారం పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం చరిత్రను గొప్పతనమును ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహోన్నతమైన వ్యక్తిని హాయ్ తెలిపారు వివేకానందుడు చిన్నతనం నుండి దేశభక్తిని కలిగి ప్రపంచ నలుమూలలు తిరుగుతూ భారతదేశ యొక్క ఔన్నత్యాన్ని చాటి చెప్పడం జరిగిందన్నారు నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవవలసిన అవసరం ఉందన్నారు కార్యక్రమంలఅమిరిశెట్టి రాజ్ కుమార్, బియ్యాల సతీష్ రావు, ఆకుల అశోక్ వర్ధన్, తుల ఆంజనేయులు, అవిడపు రాజబాబు, బుద్దారపు రాజమౌళి, బింగి సత్యనారాయణ, మెరెడికొండ శ్రీనివాస్, వెలుముల దుర్గాప్రసాద్, కాశెట్టి నాగేశ్వర్ రావు, బూర్ల చిరంజీవి, బోయిని దేవేందర్, అరె సతీష్, మణికంత మరియు తదితరులు పాల్గొన్నారు

జగన్ హయాంలో ఐదేళ్లలో రాష్ట్రంలో రూ.3.32 లక్షల కోట్ల అప్పులు చేస్తే, చంద్రబాబు ఏడాదిన్నరలోనే రూ3.02 లక్షల కోట్లు అప్ప చేశారు. వైసీపీ అప్పులు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుంది. చంద్రబాబు అప్పులు చేస్తే సింగపూర్ అవుతుందా? జగన్ చేసిన అప్పల్లో 90 శాతం చంద్రబాబు ఏడాదిన్నరలోనే చేశారు. ఎన్నికల హామీలు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదు.

- వైసీపీ నేత అంబటి రాంబాబు

ప్రాంతీయం

కొత్తకొండ జాతరకు తరలిరండి

- భక్తులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 12

శ్రీ భద్రకాళి సమేత కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయంలో జరుగుతున్న జాతర ఉత్సవాల్లో (బ్రహ్మోత్సవాలు) భక్తులు భారీగా పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేడొక ప్రకటనలో తెలిపారు. కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 9వ తేదీన ప్రారంభం అయ్యాయని తెలిపారు. పదో తేదీన స్వామివారి కళ్యాణోత్సవం జరిగిందన్నారు. బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారని, ఈ నెల 9 నుండి 18 వ తేదీ వరకు జరిగే కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు సుమారు నాలుగు నుండి ఐదు లక్షల వరకు భక్తులు హాజరవుతారనే అంచనా ఉందన్నారు. ఆలయంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారిని భక్తులు దర్శించుకునేందుకు క్యూ లైన్లను ఏర్పాటు చేశారని. ప్రత్యేక, ధర్మ, వీఐపీ, అభిషేకం దర్శనాలకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను పూర్తి చేశారని, భక్తుల కోసం చలువ పందిళ్లను సిద్ధం చేయడంతో పాటు భక్తులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని. తీర్థ స్నానాలు ఆచరించేందుకు నీటి సదుపాయాన్ని ఏర్పాటు, ఆలయంతో పాటు ప్రాంగణం చుట్టూ విద్యుత్ దీపాలతో అలంకరణ, ఆలయ కూడలి వద్ద 20 లక్షల రూపాయలతో నిర్మించిన త్రిశూలం ను ఈనెల 10వ తేదీన ప్రారంభించడాం జరిగినదన్నారు. ఆలయానికి వెళ్లే మార్గంలో నిర్మించిన త్రిశూలం భక్తులను ఆకట్టుకుంటుందని, ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఉండేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామని, 350 మంది పోలీసులు కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తారని, ఆలయం వద్ద పరిసరాల ఎప్పటికప్పుడుపరిశుభ్రతకు దాదాపుగా 150 మంది పారిశుద్ధ్య కార్మికులు, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అక్కడే వైద్య సేవలను అందించే విధంగా చర్యలు చేపట్టారు. షిఫ్టుల వారిగా వైద్యులు సిబ్బంది ఆలయానికి దర్శన నిమిత్తం వచ్చే భక్తులకు వైద్య సేవలను అందిస్తారని, ఆలయంతో పాటు ప్రాంగణం, చుట్టుపక్కల దాదాపుగా 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ, ఆలయంలో భక్తుల కోసం కోడెలు అందుబాటులో ఉండగా భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అదనంగా వేములవాడ నుండి ప్రత్యేకంగా 8 కోడెలను తెప్పించడం జరిగిందన్నారు. భక్తులకు ఎక్కడ కూడా ఇబ్బందులు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేశారని, కాగా భక్తులు అధిక సంఖ్యలో శ్రీ భద్రకాళి సమేత స్వామి వారిని దర్శించుకోవాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 12



హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన కలెక్టర్, అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి 110 అర్జీలు ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను పరిష్కరించేందుకు అధికారులు పఅత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, అధికారుల తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ను నేరుగా కలిసి విన్నవిస్తూ అర్జీలను అందజేశారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తూ వారు చెప్పిన అంశాలను కలెక్టర్ ఓపికగా విన్నారు. అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు మండలాల తహసిల్దార్లతోనూ ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం 110 అర్జీలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాదికి తీవ్ర గాయాలు

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట జనవరి 12:

సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గ్రామ శివారులోని కోహెడ క్రాస్ రోడ్డు వద్ద సిద్ధిపేట హన్మకొండ రహదారిపై సోమవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హుస్నాబాద్ కు చెందిన న్యాయవాది పూర్ణచంద్రా రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట నుంచి హుస్నాబాద్ కు కారులో వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న పూర్ణచందర్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్ లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి హమి చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్!.

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 12

పేదలకు పని హక్కులను కల్పించిన మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హమి చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో సోమవారంనాడు హన్మకొండ హరిత కాకతీయ హోటల్ లో డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సర్పంచ్ లకు ,ఉప సర్పంచ్ లకు,వార్డు సభ్యులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పని హక్కులను హరించిన విజి గ్రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయితీలు తీర్మానం చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా అంగన్ వాడి భవనాలు,పాఠశాలలకు ప్రహరి గోడలు,స్మశాన వాటికలు పల్లెపకృతి వనాల కొసం తీర్మానం చేసి యంపిడిఓ ద్వారా ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరు చేసుకొవాలన్నారు. గ్రామాలను ఆదర్శంగా మార్చాలని కొరారు.భారత దేశ మొట్టమొదటి మహిళ టిచర్ సావిత్రి బాయి పూలే బాటలో ప్రయాణించి గ్రామాలలో డ్రాపౌట్ లు లేకుండా పిల్లలందరు బడిలో వుండె విధంగా చూడలన్నారు. సర్పంచ్ లకు బాధ్యతలు ఎక్కువ అన్ని ప్రజా ప్రతినిధులలో సర్పంచ్ లకే చెక్ పవర్ వుందని అధికారాలను ఉపయోగించుకొని బాధ్యతలను నేరవర్చలన్నారు. డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ గ్రామాలలో అసమానతలు లేకుండా సమానత్వ గ్రామాలుగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు మన్నే బాబురావ్, డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, గ్రామాల సర్పంచ్ , ఉపసర్పంచ్ లు,వార్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మోస్ట్ వాంటెడ్ గంజాయి ముఠా అరెస్ట్

- ఏసీపీ శ్రీనివాస్ కుమార్ వెల్లడి

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 12:

ఆంధ్ర-ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న మోస్ట్ వాంటెడ్ గంజాయి స్మగ్లింగ్ ముఠాను మేడ్చల్ డివిజన్ ఎస్ఓటి పోలీసులు, పటాన్ చెరు పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన గ్యాంగ్ లీడర్ సచిన్ గంగారాం, మారుతి చౌహాన్, మహేష్ రవీంద్ర వట్కర్, విజయ్ చౌహాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.46 లక్షల విలువైన 92 కిలోల ఎండు గంజాయి, రూ.11 వేల నగదు, రెండు వాహనాలు (కారు,డీసీఎం), ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించగా, రెండు వాహనాల్లో 19 ప్యాకెట్లలో గంజాయి లభ్యమైంది. ఒడిస్సాలోని పరాలకేముడి ప్రాంతానికి చెందిన జాఫర్ నుంచి గంజాయిని సేకరించి సోలాపూర్‌కు సరఫరా చేస్తున్నట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నారని రామచంద్రపురం ఏసీపీ శ్రీనివాస్ కుమార్ వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో పటాన్ చెరు సీఐ వినాయక్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు, ఎస్ఓటి సీఐ శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

- వంగ రాజేశ్వర్ రెడ్డి, యువ పారిశ్రామిక వేత్త

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 12:

పండుగల సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుని,వాటిని భవిష్యత్ తరాలకు అందివ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నూతన గ్రామ పంచాయతీ పాలక వర్గానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి సాధించిన ఆర్.వెంకటలక్ష్మికి రూ.మూడు వేల నగదు, ద్వితీయ బహుమతి గెలుచుకున్న ఆర్.విమలకు రూ.1,500ల నగదు బహుమతులు అందజేశారు. మూడవ, నాల్గవ, ఐదవ బహుమతులనూ విజేతలకు వంగ రాజేశ్వర్ రెడ్డి, సర్పంచ్ కుంచం లత వెంకట్ యాదవ్, ఉపసర్పంచ్ ఒగ్గు రాజేష్ గార్లచేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 12 :

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట రెడ్డిలు అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు వారు శ్రీకారం చుట్టారు. మొయినాబాద్ కేంద్రంలో చందానగర్ నుండి కవేలిగూడవరకు 30 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే కాల యాదయ్య తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో బీటీ, సీసీరోడ్ల నిర్మాణాలతో పాటు మంచినీటి సౌకర్యానికి అత్యధిక నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో బీటీ, సీసీరోడ్ల నిర్మాణాలతో పాటు మంచినీటి సౌకర్యానికి అత్యధిక నిధులు కే టాయిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే కాలే యాదయ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 12 :

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సైనికుల పనిచేయాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద మంగళారం వార్డులో నీ మాజీ ఎంపిటిసి పార్టీ జైపాల్ రెడ్డి, పార్టీ అమరేందర్ రెడ్డి ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలను కైవసం చేసుకునేలా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, షాబాద్ దర్శన్, జైపాల్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతారం సర్పంచ్ జుట్టు రామస్వామికి ఘన సన్మానం

ప్రతిపక్షం చేవెళ్ల జనవరి:12



చేవెళ్ల నియోజకవర్గం సోమవారం సర్పంచ్ ల సన్మాన కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు భవన లు , సినిమా ఆటోగ్రాఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అంతారం గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామికి రాష్ట్ర మంత్రి చేతులమీదుగా ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయాలని ఆయన సూచించారు. గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవ ప్రస్థానం
ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యం

ప్రతిపక్షం చేవెళ్ల జనవరి:12

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమం మరియు రాష్ట్ర భవిష్యత్ దిశానిర్దేశంపై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ కమిటీ ప్రత్యేక కార్యాచరణను నివేదిక రూపకల్పన చేపట్టిందిని. కమిటీ ప్రతినిధులు కప్పాటి పాండురంగారెడ్డి తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, నంగావత్ రాజేష్ నాయక్ తెలంగాణ జాగృతి ములుగు జిల్లా అధ్యక్షుడు, బండారు శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి, శీలం విజయేందర్ కమిటి సభ్యులు విలేఖరుల ప్రకటనలో వెల్లడించారు. సోమవారం తెలంగాణ వివిద ఉద్యమ సంఘాల కమిటీ సభ్యులతో ఉద్యమ కారులతో కలసి వారి స్థితి గతులు.పై సమగ్ర నివేదికను తయారు చేస్తున్నామని వారు అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉద్యమకారులుకు వారి ఆకాంక్షలు ఎంతవరకు నెరవేరాయి అనే అంశంపై సమీక్ష స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారుల ప్రస్తుత జీవన స్థితిగతులు, వారికి అందాల్సిన ఫలాలపై దృష్టి సారించడం. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అధ్యయనం చేసి, ఉద్యమకారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఒక పక్కా బ్లూ ప్రింట్ నూ రూపొందించడం జరుగుతుందని తెలంగాణ ఆత్మ గౌరవ ప్రస్థానాన్ని మరింతముందుకు తీసుకువెళ్లేందుకు, ఉద్యమకారులందరికీ తగిన గుర్తింపు మరియు సంక్షేమం దక్కేలా చూడటమేతెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రధాన లక్ష్యం అని త్వరలోనే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీకి అందజేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో ఉండెల్లి బాబూరావు, రమేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు
మెరుగైన వైద్య సేవలందించాలి

- వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , జనవరి 12 :

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ అన్ని వేళల అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మెడికల్ కాలేజీ, సంగారెడ్డి, జోగిపేట నర్సింగ్ కళాశాలలు, టీహబ్, , జోగిపేటలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు, అవసరమైన వైద్య పరికరాలు (ఎక్విప్‌మెంట్) తదితర అంశాలపై సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని రకాల మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మందులకు ఎలాంటి కొరత తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులను బయటకు రాయొద్దని స్పష్టం చేశారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది హాజరు వ్యవస్థ పారదర్శకంగా ఉండేలా ఫేస్ రికగ్నిషన్ ఆధార్ బేస్డ్ విధానంలో జీతాల చెల్లింపు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీ కృష్ణకు సూచించారు. సంగారెడ్డి నర్సింగ్ కాలేజీ భవన ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలని టీజీఎంఐడీసీ ఈఈ రవీందర్ రెడ్డికి ఆదేశించారు. అదేవిధంగా జోగిపేటలో నిర్మాణంలో ఉన్న 150 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మరియు నర్సింగ్ కళాశాల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వసంత్ రావు, టీజీఎంఐడీసీ ఈఈ రవీందర్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా ప్రభుత్వ సేవలు అందించేందుకు అన్ని శాఖలు మనమిత్ర యాప్ ద్వారా వాటిని అమలు చేయాలి. కొన్ని శాఖలు ఇప్పటికీ మాన్యువల్‌గా సేవలు కొనసాగిస్తున్నాయి. డేటా అనుసంధానం ప్రక్రియ పూర్తి చేసి యూజ్ కేసెస్ సిద్ధం చేస్తున్నాం. ఏఐ ఆధారితంగా ఉపయోగపడే 98 కేసెస్‌ను ఇప్పటికే సిద్ధం చేశాం. ఏప్రిల్ నాటికి పూర్తిగా వాటిని అందుబాటులోకి తెస్తాం.

- ఏపీ ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్

ప్రాంతీయం

47 మెట్రిక్ టన్నుల ఈ– వ్యర్థాల సేకరణ

సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 12:

మెగా ఈ- సానిటేషన్ డ్రైవ్ లో భాగంగా తొలిరోజైన సోమవారం 48 మెట్రిక్ టన్నుల ఈ- వ్యర్థాలను జీ హెచ్ఎంసీ సేకరించింది.సోమవారం కమిషనర్ ఆర్. వి. కర్ణన్ ముషీరాబాద్ సర్కిల్‌లోని బాగ్‌లింగంపల్లిలో నిర్వహిస్తున్న మెగా ఈవేస్ట్ సేకరణ డ్రైవ్‌ను సందర్శించి, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, శాస్త్రీయంగా నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు.తొలిరోజు జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 271 లొకేషన్ లలో డ్రైవ్ చేపట్టారు. ఈ -వ్యర్థాల సేకరణకు గానూ 94 వాహనాలను వినియోగించారు. సేకరించిన వ్యర్థాలను ప్రాసెసింగ్ యూనిట్ల కు తరలించారు. మంగళవారం కూడా ఈ-సానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తారు.

12 రోజుల్లో 4,445 మెట్రిక్ టన్నుల అదనపు వ్యర్థాల తరలింపు*

జీహెచ్ఎంసి ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. 12వ రోజు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ లను సెల్ఫీ పాయింట్ ల తీర్చిదిద్దడం పై ఫోకస్ తో ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. 12 రోజుల్లో జీహెచ్ఎంసీ పరిధి 300 వార్డులలోని మొత్తం 2,803 ఏరియాలు,పాయింట్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్ లు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ లు, పార్కు లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టగా, ఇప్పటి వరకు అదనంగా 3289 మెట్రిక్ టన్నుల మున్సిపల్ వ్యర్థాలు, 1156నిర్మాణ వ్యర్థాలు మొత్తం 4,445 మెట్రిక్ టన్నుల అదనపు వ్యర్థాల తరలింపు చేపట్టారు. ఈ రెండు డ్రైవ్ లను జోనల్ కమిషనర్ లు, డిప్యూటీ కమిషనర్ లు క్షేత్ర స్థాయిలో మానిటర్ చేశారు.

కళ్యాణ లక్ష్మి పేద ప్రజలకు ఒక వరం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 12 ;

పేద ప్రజలకు కళ్యాణ లక్ష్మి చెక్కు అంటే ఒక వరం లాంటిదని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో మెదక్ పట్టణము మెదక్ ఘనపూర్ మండలాల కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు కళ్యాణ లక్ష్మి చెక్కులు ఒక వరం లాంటి అని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందుతున్నాయని రాబోవు రోజులలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్ కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ అంటే కన్నతల్లి లాంటిది

- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 12 :

కాంగ్రెస్ పార్టీ అంటేనే కన్న తల్లి వంటిదని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం లో సదాశివపేట మండలం ఆత్మకూరు, కంబాలపల్లి లో మొదటి రెండు ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయి. సోమవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గృహ ప్రవేశాలకు హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే కన్న తల్లి వంటిదని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ల పేరుతో ప్రజా ధనం దుర్వినియోగం చేసిందన్నారు. ఒక ఊరి వారికి మరో ఊరిలో డబుల్ బెడ్ రూం కేటాయించిందని, ఎలాంటి సౌకర్యాలు కల్పించక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షలు కేటాయించి ఉన్న ఊరిలోనే ఇంటి కలను సాకారం చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు దారులకు డబ్బులు వస్తాయో రావో అన్న అనుమానం అక్కర్లేదని ప్రతీ ఒక్కరికీ 5 లక్షల రూపాయలు వస్తాయన్నారు. ఇంకా దరఖాస్తు చేయని వారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, ఆత్మకూరు సర్పంచ్ నికిత బింబాధర చారి, మాజీ సర్పంచ్ గంగన్న, హౌజింగ్ డీఈ మాధవ రెడ్డి, ఏఈ రేష్మ, కంబాలపల్లి సర్పంచ్ ఇందురి భారతమ్మ బాబు, ఆత్మకూరు ఉప సర్పంచ్ అశోక్ , కంబాలపాల్లి ఉప సర్పంచ్ పార్వతమ్మ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యూసబ్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల డివిజన్ ఏర్పాటు ఏర్పాటుకు కృషి చేస్తా

- సీఎం దృష్టికి తీసుకెళ్తా ఎంపీ చామల కిరణ్ కుమార్
- అవకాశం వచ్చిన ప్రతీసారి అసెంబ్లీలో లేవనెత్తుతున్న ఎమ్మెల్యే పల్లా

ప్రతిపక్షం చేర్యాల, జనవరి 12 :

చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం చేర్యాల పట్టణానికి వచ్చిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి లకు చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేసి చేర్యాల ప్రాంత అస్తిత్వం,ఉనికి, ఆత్మగౌరవం ఈ ప్రాంత ఔనత్యం చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు పైనే ఉన్నదని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ వివరించారు. దీనిపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను ఆకాంక్షను నెరవేర్చే బాధ్యత తాను తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పల్లా స్పందించి అవకాశం వచ్చిన ప్రతీ సందర్భంలోనూ అసెంబ్లీ సమావేశాల్లో లెవనెత్తుతూ ప్రభుత్వం దృష్టికి తీవ్రంగా తీసుకెళ్తున్నానని, ఎంపీ సహకారంతో రెవెన్యూ డివిజన్ సాధించి తీరుతామని హామీ ఇచ్చారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ లు గిరి కొండల్ రెడ్డి, కొమ్ము నర్సింగ రావు, ఆకునూరు సర్పంచ్ కొమ్ము రవి, జేఏసీ నాయకులు అందే అశోక్, అందే బీరయ్య, బుట్టి సత్యనారాయణ, జంగిలి యాదగిరి, వలబోజు నర్సింహా చారి, చంద శ్రీకాంత్, నంగి కనకయ్య, సుంకోజు రజిత, గోమారపు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

- సీఎం రేవంత్ రెడ్డి
- వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను వర్చువల్ గా ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి
- పాల్గొన్న టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , జనవరి 12 :

దేశంలో ఎక్కడా లేనివిధంగా వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కుటుంబంలా అండగా నిలిచి మానసిక ఉత్సాహాన్ని అందించే లక్ష్యంతో ప్రణామ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం హైదరాబాద్ నుండి వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్లను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లాలో పట్టణంలోని మహిళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మహిళా ప్రాంగణంలోని డే కేర్ సెంటర్ నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, స్థానిక శాసనసభ్యులు చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి తో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం డే కేర్ సెంటర్లను ప్రారంభించిందని తెలిపారు. వృద్ధులు మానసికంగా ఉల్లాసంగా, ఆరోగ్యంగా గడపడానికి ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను జిల్లా సంక్షేమ అధికారి,మహిళా,శిశు, దివ్యాంగుల,వయోవృద్ధుల శాఖ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ డే కేర్ సెంటర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రభుత్వ పని దినాల్లో పనిచేస్తుందని తెలిపారు. వయోవృద్ధుల విజ్ఞానం, వినోదం కోసం లైబ్రరీ, టీవీ సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. మానసిక ఉల్లాసం కోసం క్యారం, చెస్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రముఖ వైద్యులచే ఆరోగ్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా డే కేర్ సెంటర్‌లో ప్రతిరోజూ ఉచితంగా టీ, స్నాక్స్ అందించడం జరుగుతుందని వెల్లడించారు. కేంద్రంలో ఇంకా ఏవైనా అవసరాలు ఉంటే వృద్ధులు తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వయోవృద్ధుల కోసం ఇంత మంచి సదుపాయాన్ని కల్పించడం వారి పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లాలోని వయోవృద్ధులందరూ ఈ డే కేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా మహిళా సంక్షేమ అధికారి లలిత కుమారి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రెటరీ వనజా రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, సిడిపిఓ, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పేదలకు విద్య వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత
- రైతు సంక్షేమ పథకాలను రైతులు వినియోగించుకోవాలి
- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గణపురం గ్రామంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటన
- ఆత్మహత్య చేసుకున్న రైతుతో పాటు,గుండె పోటుతో మరణించిన వ్యక్తుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి
- రూ.మూడు లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేత

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 12:

పేదలు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపురం గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఎల్ల రాజిరెడ్డి (50), గణపురం రాములు(45) కుటుంబాలను సోమవారం రాత్రి పరామర్శించారు. రెండు కుటుంబాలకు రూ.మూడు లక్షల చొప్పున ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పుల బాధ భరించలేక ఘనపురం గ్రామంలో ఎల్ల రాజిరెడ్డి రాజిరెడ్డి మృతి చెందిన విషయం పత్రికల్లో చదివి బాధ పడినట్లు తెలిపారు. బాధ్యత గల మంత్రిగా రాజిరెడ్డి కుటుంబానికి ధైర్యం చెప్పి ఓదార్చేందుకు వచ్చినట్లు తెలిపారురైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసని, ఇలాంటి ఘటనలు చాలా బాధాకరమని అన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక, వ్యవసాయంతో పాటు తనకు వీలయ్యే వ్యాపారం ప్రారంభించి రాజిరెడ్డి అప్పుల పాలయ్యారని తెలిసి హృదయం కలిచి వేసిందని చెప్పారు. రాజిరెడ్డి భార్య వేదన తీర్చలేనిదన్నారు. రాజిరెడ్డి కుమారుని అర్హతలు తగినవిధంగా ఏదైనా కంపెనీలో ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. తాను వ్యక్తిగతంగా సాయం చేయడమే కాక రైతు బీమా కింద కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు.రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని మంత్రి సూచించారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నదని, రైతులకు అవసరమైన రుణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతుల కష్టసుఖాల్లో ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, ఈ విషయంలో తాను వ్యక్తిగతంగా సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు తోడుగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఇదే గ్రామంలో చిన్న వయసులోనే ఘనపురం రాములు గుండె పోటుతో మరణించడం బాధాకరమన్నారు. వీరి కుటుంబానికి వ్యక్తిగతంగా సాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంతో పాటు, పేదలకు విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు. పేదలకు ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.అయిదు లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఇప్పటి వరకు కోసం కింద వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.600 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వైద్యం చేయించుకునే స్తోమత లేని పేదలు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లోగా రూ.మూడు లక్షల వరకు ఎన్వోసీ జారీ చేస్తున్నట్లు తెలిపారు. పేదలు దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీ సీ సీ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరిపల్లి చంద్రం, చెలికాని యాదగిరి, కరెడ్ల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్య చైతన్య స్ఫూర్తి స్వామి వివేకానంద

- విద్యార్థుల్లో జాతీయ భావన పెంపొందించాలి
- బొల్లి నర్సింలు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 12 :

స్వామి వివేకానంద జీవితం, ఆయన రచనలు, ఉపన్యాసాలు సమాజ హిత కార్యక్రమాలకు జీవితాంతం స్ఫూర్తి నిస్తాయని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మెదక్ విభాగ్ సహ కార్యవాహ బొల్లి నర్సింలు అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో సోమవారం నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాతలని, వారిలో జాతీయ భావనతో పాటు సామాజిక బాధ్యతా దృక్పథాన్ని పెంపొందించాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమానికి తపస్ జిల్లా అధ్యక్షుడు చిలుముల మురళీధర్ అధ్యక్షత వహించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ నర్సిరెడ్డి, శ్రీనాకర్ రెడ్డి, తిరుపతి, జనార్దన్,శ్రీకాంత్, మల్లేశం, రూప్ సాగర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకనంద అడుగుజాడల్లో నడవాలి

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 12:

స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలని సర్పంచ్ అనురాధ రమేష్ అన్నారు సోమవారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ తో పాటు ఆయా గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానంద ను ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లో ముందుండాలన్నారు సమాజంలో చెడు మార్గాన్ని విడనాడి సన్మార్గమైన మార్గంలో ప్రజలు నడిచేలా కృషిచేసిన ఆయనను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు భారతదేశాన్ని ప్రేమించి దేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆది బాలకృష్ణ, మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

కలెక్టరేట్ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రతిపక్షం సిద్దిపేట టౌన్, జనవరి 12

కలెక్టరేట్‌లో అన్ని శాఖల అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. కపిల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జె. తిరుపతి, జి. వాసవి, జనరల్ సెక్రటరీగా ఎస్. నాగరాజు, ట్రెజరర్‌గా భూంపల్లి అరవింద్‌ను ఎన్నుకున్నారు. చీఫ్ అడ్వైజర్‌గా సిహెచ్. అభిలాష్, జాయింట్ సెక్రటరీలుగా సంతోష్, వంశీ, రేణుక నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వేముల నాగరాజు, మహిపాల్ రెడ్డి, ఆశీరెడ్డి, పర్శ రాములు, శేఖర్ పాల్గొన్నారు.

“



గోదావరి పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం. ఇది పూర్తయితే దక్షిణ భారత్‌లో ఏ రాష్ట్రమూ మనతో పోటీపడలేదు. ఏటా 3వేల టీఎంసీల గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి పోతోంది. తెలుగు రాష్ట్రాలు ఈ జలాలను సమర్థంగా వినియోగించుకోవచ్చు. పోలవరంలో మిగిలే నీళ్లను తెలంగాణ కూడా వినియోగించుకోవచ్చు. నల్లమల సాగర్‌తో ఎవరికీ నష్టం లేదు.

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

వందేభారత్ స్లీపర్ ఛార్జీలు ఖరారు..

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. అత్యాధునిక సదుపాయాలతో, దూర ప్రాంత ప్రయాణాలకు అనువుగా ఉండే ఈ రైలు కోల్‌కతా గువాహటి మధ్య త్వరలో పరుగులు పెట్టనుంది. ఈ నేపథ్యంలో వందే భారత్ స్లీపర్ రైలుకు సంబంధించిన ఛార్జీల వివరాలు, బుకింగ్ రూల్స్‌ను రైల్వే శాఖ నోటిఫై చేసింది. ఆ వివరాలు ఇవీ..ఈ రైలులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. 400 కిలోమీటర్ల ప్రయాణానికి 3ఏసీ ప్రయాణానికి ఈ ఛార్జీ వర్తిస్తుంది. అంటే ప్రయాణికుడు అంతకంటే తక్కువ దూరానికే టికెట్ బుక్ చేసుకున్నా ఈ ఛార్జీ చెల్లించాల్సి ఉంటుందన్నమాట. గరిష్ఠంగా 3,500 కిలోమీటర్లకు 1ఏసీ ఛార్జి రూ.13,300గా నిర్ణయించారు. కిలోమీటర్ వారీగా చూసినప్పుడు (కనీస టికెట్ ధర).. 3 ఏసీకి కిలోమీటరుకు రూ.2.4; 2 ఏసీకి కిలోమీటరుకు రూ.3.1; 1 ఏసీకి కిలోమీటరుకు రూ.3.8 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. దూరాన్ని బట్టి టికెట్ ధరలు పెరుగుతాయి.వందేభారత్ స్లీపర్ రైలులో టికెట్ కన్ఫామ్ అయిన వారికే ప్రయాణానికి అనుమతిస్తారు. అలాగే, ఆర్ఏసీ (RAC)కి ఇందులో చోటులేదు. అంటే వెయిటింగ్ లిస్ట్, పాక్షికంగా కన్ఫామ్ అయిన ప్రయాణికులను ఈ రైలులో ప్రయాణానికి అనుమతించరు. అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ నుంచే (60 రోజుల ముందు నుంచి) అన్ని బెర్తులూ అందుబాటులో ఉంటాయి. ఇందులో మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ కోటా ఉంటుంది. ఇతర కోటాలకు చోటు లేదు. డిజిటల్ రూపంలోనే టికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. తద్వారా టికెట్లను క్యాన్సిల్ చేసినప్పుడు 24 గంటల్లో రిఫండ్ చేస్తారు. 45 ఏళ్లు పైబడిన మహిళలకు, 60 ఏళ్లు పైబడిన పురుషులకు సీట్ల అందుబాటును బట్టి లోయర్ బెర్తులను సిస్టమ్ ఆటోమేటిక్‌గా కేటాయిస్తుంది.

విశ్వ వీక్షణం

చైనా గుత్తాధిపత్యానికి జపాన్ 'చెక్'

ప్రపంచ సాంకేతికత, ఆధునిక యుద్ధానికి పునాది అయిన అరుదైన భూమి లోహాలపై చైనా గుత్తాధిపత్యం కలిగి ఉంది. 2025లో చైనా విధించిన ఆంక్షల తరువాత ఇండియా స్నేహితుడు అయిన జపాన్ బీజింగ్‌కు చెక్ పెట్టింది. వాస్తవానికి ప్రపంచం ఇప్పటివరకు చైనాపై ఆధారపడిన విలువైన ఖనిజాలను వెలికి తీసేందుకు జపాన్‌కు చెందిన ఒక భారీ నౌక బయలుదేరింది. దీంతో ఈ ఆటలో ఇకపై చైనా ఆట ముగిసినట్లే అని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాయిటర్స్ నివేదికల ప్రకారం.. జపాన్ యొక్క పరీక్షా నౌక చిక్యూ, టోక్యో నుంచి దాదాపు 1,900 కిలోమీటర్ల దూరంలో ఉన్న మినామిటోరి ద్వీపం వైపు వెళుతోంది. ఈ ఓడ యొక్క లక్ష్యం చాలా సంక్లిష్టమైనది. ఎందుకంటే ఇది మినామిటోరి ద్వీపం ప్రాంతంలోని సముద్ర ఉపరితలం నుంచి 6 కిలోమీటర్లు (4 మైళ్ళు) దిగువన డైవ్ చేయబోతుంది. ఈ సముద్రపు అడుగున ఉన్న బురదలో అరుదైన రేర్‌ఎర్త్ ఖనిజాల అపార నిల్వలు ఉన్నాయని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. ఇంత లోతు నుంచి నిరంతరం బురదను వెలికితీసి విశ్లేషించడం ప్రపంచంలో ఇదే మొదటిసారి అవుతుందని చెబుతున్నారు. 130 మంది సిబ్బంది, పరిశోధకుల బృందంతో కూడిన ఈ నౌక ఈ మిషన్‌ను పూర్తి చేసి ఫిబ్రవరి 14 నాటికి తిరిగి వస్తుందని సమాచారం.ఈ రోజు మనం ఉపయోగించే స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ కార్లు, జాతీయ భద్రత కోసం మోహరించిన క్షిపణి వ్యవస్థల సృష్టిలో అరుదైన ఈ రేర్‌ఎర్త్ ఖనిజాల కీలక పాత్ర పోషిస్తాయి. ఇప్పటివరకు జపాన్, పాశ్చాత్య దేశాలు ఈ ఖనిజాల కోసం చైనాపై ఆధారపడ్డాయి. అయితే బీజింగ్‌తో కొనసాగుతున్న దౌత్య వివాదాల మధ్య, చైనా ఈ ముఖ్యమైన ఖనిజాల ఎగుమతిపై అనేక ఆంక్షలు విధించింది. చైనా నుంచి ఈ "బ్లాక్‌మెయిలింగ్"ను నివారించడానికి, జపాన్ ఇప్పుడు సరికొత్త అన్వేషణ వైపు అడుగులు వేస్తోంది. ఈ మిషన్ విజయవంతమైతే సాంకేతిక రంగంలో సరఫరాలపై చైనా ఆధిపత్యం అంతం కావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.పలు నివేదికల ప్రకారం.. జపాన్ ప్రభుత్వం గత ఏడు సంవత్సరాలుగా దీని కోసం సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వ మద్దతుతో నడుస్తున్న ఈ ప్రాజెక్టు అధిపతి షోయిచి ఇషి ఓడ ప్రారంభం అయినప్పుడు చాలా భావోద్వేగానికి గురయ్యాడు. సముద్ర మట్టానికి 6 కిలోమీటర్ల దిగువన వనరులను వెలికితీయడం ఒక పెద్ద సాంకేతిక విజయం అని షోయిచి ఇషి చెప్పారు. ఈ విజయం జపాన్ వనరుల సేకరణ పద్ధతులను పూర్తిగా మారుస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

షక్స్‌గామ్‌పై చైనా కొత్త వాదన..

షక్స్ గామ్ వ్యాలీ...ఇది పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో ఒక భాగం. మొత్తం 5, 180 చదరపు కిలోమీటర్ల భూభాగం. దీన్ని 1963లో పాక్ చట్ట విరుద్ధంగా చైనాకు అప్పగించింది. అయితే భారత్ అప్పటి నుంచి దీన్ని ఒప్పుకోవడం లేదు. షక్స్‌గామ్ లోయ భారత భూభాగమని చెబుతూనే ఉంది. తాజాగా ఈ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. షక్స్ గామ్ వ్యాలీలో చైనా తాజాగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టింది. అయితే దీనిపై భారత్ అభ్యంతరం తెలిపింది. 1963లో చైనాపాక్ సరిహద్దు ఒప్పందాన్ని గుర్తించమని...అక్కడ నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమని అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. చైనాపాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ ను కూడా తాము గుర్తించమని, ఇది పాకిస్తాన్ బలవంతంగా, చట్టవిరుద్ధంగా ఆక్రమించిన భారత భూభాగం గుండా వెళ్తోందని ఆయన అన్నారు. ఇది భారత భూభాగం కాబట్టి దాని ప్రయోజనాలలను కాపాడుకునే అవసరమైన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై ఇప్పుడు చైనా కూడా ప్రకటన చేసింది. ఈ ప్రాంతంలో చేపడుతున్న సౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిందకు అతీతమని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ అన్నారు. షక్స్ గామ్ చైనాలో భూభాగమని మరో సారి వాదించారు. చైనా తన సొంత భూభాగంలో మౌలిక సదుపాయాలను నిర్మించడాన్ని నిందించకూడదని ఆమె అన్నారు. చైనా, పాకిస్తాన్ 1960ల నుండి సరిహద్దు ఒప్పందంపై సంతకం చేశాయని, రెండు దేశాల మధ్య సరిహద్దును నిర్ణయించాయని మావో చెప్పారు. సార్వభౌమ దేశాలుగా మా రెండు దేశాలకు ఈ హక్కు ఉందని చెప్పారు. CPEC ద్వారా స్థానిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి, ప్రజల జీవనోపాధి మెరుగుపరిచేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. CPEC కాశ్మీర్ సమస్యపై చైనా వైఖరిని ప్రభావితం చేయమని, ఈ విషయంలో చైనా వైఖరి మాదని చెప్పారు. భారత్, పాకిస్తాన్ కాశ్మీర్ సమస్యలను ఇందులోకి తీసుకు రాకూడదని మావో అన్నారు. వాటిని యూఎన్ ద్వారా ద్వైపాక్షిక ఒప్పందాల ప్రకారం, శాంతి యుతంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. షక్స్ గ్యామ్ వ్యాలీ విషయంలో కాశ్మీర్ అంశాన్ని తీసుకురావద్దని చెప్పారు.

బంగ్లాలో ఆగని హింస



బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు ఆగడం లేదు. తాజాగా సమీర్ దాస్ అనే హిందూ ఆటో డ్రైవర్‌ను దుండగులు కొట్టి చంపారు. చిట్టగాంగ్‌లోని దగన్‌భునియా అనే ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమీర్‌ను కొందరు దుండగులు చితకబాది అనంతరం కత్తితో పొడిచి చంపారు.

అనంతరం అతడి ఆటోతో పరారయ్యారు. బంగ్లాదేశ్‌లో ఇటీవలి కాలంలో మైనార్టీలపై జరుగుతున్న దాడులు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

తెలంగాణ సంస్కృతికి ప్రాణం..

బాతిక్ చిత్రం



- జియో ట్యాగింగ్ తో అంతర్జాతీయ గుర్తింపు
- భౌగోళిక సూచిక గుర్తింపు కోసం కసరత్తు

బాతిక్.. చిత్రకళల్లో ప్రత్యేకమైనది. బాతిక్ చిత్రకళ.. పేరు వినగానే సిద్దిపేట ఠక్కున గుర్తొస్తుంది. అంతగా సిద్ధిపేట ప్రాంతంతో బాతిక్ చిత్ర కళ మమేకమైంది. 1990 దశకంలో ఒక వెలుగు వెలిగింది. ప్రత్యేక శైలి ఉన్న ఈ కళకు అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చేందుకు పలువురు కళాకారులు కృషి చేశారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ ద్వారా 'సిద్దిపేట బాతిక్ చిత్రకళ'కు జీఐ (భౌగోళిక సూచిక) గుర్తింపుతో బాతిక్ కళకు అంతర్జాతీయ గుర్తింపు కోసం కసరత్తు మొదలైంది.

జావా దీవుల్లో పుట్టి.. ఇండోనేషియా, మలేషియా దేశాల్లో ప్రసిద్ధి చెంది...

ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'బాతిక్ చిత్రకళ' ఎంతో ప్రాచీనమైనది. సుమారు రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన బాతిక్ చిత్ర కళ ఇండోనేషియాలోని జావా దీవుల్లో పుట్టింది. ఇండోనేషియా, మలేషియా దేశాల్లో జనాదరణ పొందింది. మైనంతో బొమ్మలు వేసే విభిన్న ప్రక్రియగా పేరు పొందింది. ఈ చిత్రకళ ఇండోనేషియా నుండి భారత దేశంలోకి ప్రవేశించింది. సామాన్య శకం (క్రీ.శ.)2వ శతాబ్దంలో మన దేశంలోకి అడుగు పెట్టింది. మన దేశంలో స్థానిక, ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్పు చెందింది. మహిళల మనసు దోచేలా చీరలు, లంగా ఓణీలతో పాటు కర్టెన్లు, కవర్లు, దుప్పట్ల లాంటి గృహోపకరణాలపై అందమైన బొమ్మల రూపంలో కొలువుదీరుతోంది.

తెలంగాణలో పునర్జన్మ

బాతిక్ చిత్ర కళ ఇండోనేషియా నుండి భారతదేశానికి ప్రవేశించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఇండోనేషియాలోని జావా పర్యటనలో బాతిక్ కళకు ముగ్ధుడై, శాంతినికేతన్‌కు తీసుకు వచ్చారు. ప్రముఖ చిత్రకారుడు నందలాల్ బోస్ కుమార్తె గౌరీ భంజా శాంతినికేతన్‌లో ఈ కళకు నాంది పలికారు. నందలాల్ బోస్ మార్గదర్శకత్వంలో ఆయన కుమార్తెలు గౌరీ భంజా, జమునాసేన్ దీనిని ఒక ప్రత్యేక కళారూపంగా తీర్చిదిద్దారు. 1966లో జగదీశ్ మిట్టల్, కమల మిట్టల్ దంపతులు ఈ కళను తెలంగాణ ప్రాంతానికి పరిచయం చేశారు. అప్పట్లో బాతిక్ కళను లక్ష్మాగౌడ్, కాపు రాజయ్య, సూర్యప్రకాశ్, గౌరీశంకర్, బాలయ్య వంటి కళాకారులు అభ్యసించారు. యాసాల బాలయ్య ప్రత్యేకమైన శైలిని అభివృద్ధి చేసి 35 ఏళ్ల నుంచి ఈ కళను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆయన కుమారుడు యాసాల ప్రకాశ్ బాతిక్ కళను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో ఆర్ట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గిరిజన విద్యార్థులకు ఈ చిత్రలేఖ కళను బోధిస్తూ వారిని సృజనాత్మకత వైపు ప్రేరేపిస్తున్నారు.

రూపకల్పనలో భిన్నం

కలంకారీ'ని పోలిన బాతిక్ చిత్రకళ రూపకల్పనలో మాత్రం చాలా భిన్నంగా ఉంటుంది. నూలు వస్త్రం, పట్టు వస్త్రంపైనా బాతిక్ చిత్రం వేస్తారు. మిగతా పెయింటింగ్స్ లాగా ఈ కళలో నేరుగా వస్త్రాలపై రంగులు వేయడం కుదరదు. ముందుగా తెల్లని వస్త్రంపై కావలసిన బొమ్మను పెన్సిల్‌తో గీస్తారు. తేనెపట్టు మైనం, పారాఫిన్ మైనాన్ని సమపాళ్లలో కలిపి వేడిచేసి, మరిగిస్తారు. ఒక సన్నని వెదురు కర్రకు రెండు ఇనుప చువ్వలను ఒక అంగుళం మేర బయటికి ఉండేలా గట్టిగా కడతారు. దీనికి కండె ఆకారంలో దారాన్ని చుడుతారు. దీనిని మరుగుతున్న మైనంలో ముంచి, అప్పటికే గుడ్డపై పెన్సిల్‌తో వేసిన బొమ్మల గీతలపై గీస్తారు. ఇనుప చువ్వల ద్వారా కారిన మైనం పెన్సిల్ గీతలను కప్పేస్తుంది. ఆ తర్వాత వస్త్రంపై కావాల్సిన రంగులను అద్దుతారు. అనంతరం వేడి నీటిలో ఈ వస్త్రాన్ని ముంచితే, మైనం కరిగిపోతుంది. ఆ తర్వాత మరొక రంగు కోసం ఇదే ప్రక్రియను పునరావృతం చేస్తారు. ఇలా ఎన్ని రంగులు కావాలంటే అన్నిసార్లు ఇదే ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. బొమ్మల మధ్యలో ఖాళీ స్థలాన్ని పూరించడానికి నెఫ్తాలీ రంగులను ఉపయోగిస్తారు. చివరలో వేడి నీళ్లను మరిగించి, సర్ఫ్ వేసి మైనపు గుడ్డను అందులో ముంచుతారు. తద్వారా మైనం తొలగిపోయి వస్త్రం శుభ్రం అవుతుంది. ఈ ప్రక్రియలన్నీ పూర్తయ్యాక తయారైన చిత్రాన్ని బాతిక్‌గా వ్యవహరిస్తారు.

ప్రత్యేక కలం.. సిద్ధిపేట సొంతం

తేనే తుట్టె నుంచి సేకరించిన మైనం, తెల్లని క్యాండిల్ మైనం మిశ్రమాన్ని వేడి చేసి ద్రవ రూపంలోకి మారుస్తారు. ఇదే చిత్రాలు వేయడానికి ఆధారం. ఇందు కోసం సిద్ధిపేటలో ప్రత్యేక కలాన్ని(సాధనం) రూపొందించారు. సన్నటి కర్ర చివర(రంధ్రానికి) యు ఆకృతిలో పిన్ అమరుస్తారు. దీనికి అనుసంధానంగా దారం ఉంటుంది.ముందుగా కాగితంపై చిత్రం గీసి.. ఆ ఆకృతిని కాటన్ వస్త్రంపై అచ్చు వేస్తారు. పెన్నుతో మైనం చుక్కలతో అవుట్ లైన్ గీస్తారు. ప్రతి రంగుకు అవసరమైన చోట మైనం అద్దుతారు. ఆ తర్వాత వేడి నీటిలో ముంచి తీస్తారు. వివిధ దశల్లో శుభ్రం చేస్తారు. మైనం కారణంగా కొన్ని చోట్ల పగుళ్లు ఏర్పడు తాయి. ఇదే కొత్త అందం, ఆకర్షణను తెస్తుంది.

15 నుంచి 20 రోజులు

బాతిక్ చిత్ర కళ ద్వారా ఒక చిత్రాన్ని వేయడానికి సగటున 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. దీంతో కళాకారులు ఒకే సమయంలో అయిదు నుంచి పది చిత్రాలను ఆవిష్కరించేందుకు ప్రణాళిక రూపొందించుకుంటారు. సిద్ధిపేట పరిసర ప్రాంతాల్లో పది మందికి పైగా ఈ కళతో అనుబంధం ఉంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత చేరువ అవుతుంది. గ్రామీణ వాతావరణం, తెలంగాణ సంస్కృతికి ఈ చిత్రాల్లో ప్రాధాన్యం ఇస్తారు. దుప్పట్టా, కండువాలపై వేస్తున్నారు. బాతిక్ పద్ధతిలో చిత్రం వేయడానికి కళాకారుడికి శ్రద్ధ, ఓపిక, సహనం, ఏకాగ్రత అవసరం. ఈ చిత్రాలను గృహాలంకరణకు వాడతారు. వస్త్రాలుగానూ ధరిస్తారు. దేని అందం దానిదే!

ఖ్యాతిని గడించిన సిద్దిపేట ఆణిముత్యం..

సిద్దిపేట వాసి దివంగత కాపు రాజయ్య చిత్రకళలో అంతర్జాతీయ ఖ్యాతి గడించారు. యాసాల బాలయ్య...బాతిక్ కళను తన ఇంటి పేరుగా మార్చుకొని 'బాతిక్ బాలయ్య'గా పేరొందాడు. సిద్దిపేట జిల్లా నారాయణరావు పేట మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన బాలయ్య బాల్యం నుంచే చిత్రకళ పట్ల ఆకర్షితుడయ్యాడు. బాలయ్యలోని ఆసక్తిని ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ కాపు రాజయ్య గుర్తించారు. చిత్రకళలో మెళకువలు నేర్పారు. అనంతరం ప్రముఖ చిత్రకారుడు, పద్మశ్రీ లక్ష్మాగౌడ్ శిష్యరికంలో బాలయ్య బాతిక్ కళలో ఆరితేరాడు. ప్రకృతి, పండుగలు, పబ్బాలు, సమస్త గ్రామీణ జీవనానికి అద్దంపట్టే బాతిక్ చిత్రాలకు రూపకల్పన చేశారు. బాలయ్య తన చిత్రాలలో పల్లె జీవనాన్ని ముఖ్యంగా పల్లె మహిళల జీవనవిధానాన్ని ఉట్టిపడేలా చిత్రించారు. తన ప్రతిభతో 2003లో ఆలిండియా ఫైన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ సొసైటీ(ఏఐఎఫ్ఏసీఎస్)చే సన్మానం పొందారు. 1991లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి, 1994లో నాటి రాష్ట్రపతి డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ చేతుల మీదుగా జాతీయ ఉత్తమ చిత్రకళ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. బాలయ్య చిత్రాలు లాస్‌ఏంజిల్స్, సాలార్జంగ్, హైదరాబాద్ స్టేట్, చెన్నై మ్యూజియాలతో పాటు, లలిత కళా అకాడమీలో ప్రదర్శిస్తున్నారు. మళయాల మనోరమ పత్రిక ఆయన 'గ్రామ దేవతలు' చిత్రాన్ని వార్షిక సంచికలో ముద్రించి గౌరవించింది. తన జీవితాన్ని బాతిక్ చిత్ర కళకే అర్పించిన బాలయ్య.. బాతిక్ కళ మీద సమగ్ర గ్రంథాన్ని కూడా రచించారు. దేశంలోని ప్రధాన నగరాలతో పాటు అమెరికాలో 60 ప్రదర్శనలు ఇచ్చారు. బాలయ్య స్ఫూర్తితో ఆయన కుమారుడు ప్రకాశ్ ఇదే కళలో రాణిస్తున్నారు. జిన్నారం గిరిజన గురుకుల పాఠశాలలో ఆర్ట్ టీచరుగా పని చేస్తూనే, సిద్దిపేట వేదికగా బాతిక్ పెయింటింగ్ సొసైటీని నిర్వహిస్తున్నారు.

బాతిక్ చిత్రలేఖన శిక్షణకు సిద్దిపేట బాతిక్ సొసైటీ

బాతిక్ కళ అభివృద్ధికి సిద్దిపేట బాతిక్ సొసైటీ స్థాపించారు. ఈ సొసైటీలో కళాకారిణి యాసాల మమత ఆధ్వర్యంలో అనేక మంది యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కళను తెలంగాణలో భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. విజయ దశమి 2025 సందర్భంగా బాతిక్ కళను ప్రపంచానికి పరిచయం చేసేలా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సాయిబాటిక్స్.కామ్ (www.saibatiks.com) అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా బాతిక్ కళా పటాలను, శిక్షణ వివరాలను, ఆన్‌లైన్ ఆర్ట్ గ్యాలరీలను అందుబాటులోకి తెచ్చారు. త్వరలో సిద్ధిపేటలోని యాసాల ఆర్ట్ గ్యాలరీలో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రకాశ్ వెల్లడించారు.

దావోస్ సమావేశంలో అంతర్జాతీయ గుర్తింపు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ వ్యాపార సమావేశంలో గౌతమ్ అదానీకి బాతిక్ పెయింటింగ్‌ను బహూకరించారు. దీంతో ఈ కళకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. తెలంగాణ కళలకు ప్రత్యేక స్థానం కల్పించాలనే లక్ష్యంతో సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సందర్శించారు. బాతిక్ చిత్రకళ అభివృద్ధికి సిద్దిపేటలో సాగుతున్న ప్రయత్నాలను ప్రశంసించారు.

అమెరికాలో ఆకట్టుకున్న బాతిక్ చిత్ర ప్రదర్శన

తెలంగాణ రాష్ట్ర సంప్రదాయ చిత్రలేఖన కళల్లో ఒకటైన బాతిక్ చిత్రకళ ప్రదర్శనను ఇటీవల అమెరికాలో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. బాతిక్ కళను అమెరికాలో ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చేందుకు అమెరికాలోని డబ్లిన్ నగరంలో ఈ ప్రత్యేక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమెరికాలోని తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం(టీడీఎఫ్) సాంస్కృతిక శాఖ కళానిధి ఆధ్వర్యంలో అమెరికాలో తెలంగాణ కళల పరిరక్షణకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే బాతిక్ చిత్రలేఖన కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీడీఎఫ్ యూఎస్ఏ వేదికగా టీడీఎఫ్ యూఎస్ఏ అధ్యక్షుడు శ్రీనివాస్ మణికొండ, టీడీఎఫ్ఇండియా అధ్యక్షుడు మట్ట రాజేశ్వరరెడ్డితో కలిసి బాతిక్ కళ ప్రదర్శనను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఆర్ఐ సభ్యులకు బాతిక్ కళ చరిత్ర, విశిష్టత, ఇతర ఆసక్తికరమైన వివరాలను ప్రముఖ బాతిక్ కళాకారుడు రాజు యాసాల తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మణికొండ మాట్లాడుతూ తెలంగాణ కళలు ముఖ్యంగా బతుకమ్మ వంటి అంశాలను బాతిక్ చిత్రాల ద్వారా విశేషంగా చూపించడం హర్షణీయం అన్నారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ ద్వారా బాతిక్ కళకు అంతర్జాతీయ గుర్తింపు కోసం టీడీఎఫ్ యూఎస్ఏ కృషి చేస్తోందని తెలియజేశారు. బాతిక్ కళను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు దశాబ్దాలుగా కృషి చేస్తున్న బాతిక్ చిత్ర కళాకారుడు యాసాల ప్రకాశ్, వారి సతీమణి మమతను టీడీఎఫ్ఇండియా అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్ రెడ్డి ప్రశంసించారు. యువతకు ఈ బాతిక్ చిత్ర లేఖనంపై శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

జీ ఐ ట్యాగ్ అంటే...

ఒక నిర్దిష్ట ప్రాంతం నుండి వచ్చిన ఉత్పత్తులకు వాటి నాణ్యత, ఖ్యాతి లేదా లక్షణాల ఆధారంగా ఇచ్చే పేరు లేదా గుర్తింపే భౌగోళిక సూచిక (జీ ఐ) ట్యాగ్. ఒక్కో ప్రాంతంలో తయారయ్యే లేదా ఉత్పత్తి అయ్యే వస్తువులకు సహజంగా ఒక నాణ్యత ఉంటుంది. అదే వాటి ప్రత్యేకత. ఆ విశిష్టతను దృష్టిలో ఉంచుకొని చేసిందే "ది జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్ (రిజిస్ట్రేషన్ అండ్ ప్రొటెక్షన్) యాక్ట్ 1999". ఒక ప్రత్యేకమైన భౌగోళిక ప్రాంతం నుంచి వచ్చే ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఇండికేషన్) వర్తిస్తుంది. భారతదేశంలో భౌగోళిక సూచిక ట్యాగ్‌లను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ రిజిస్ట్రీ జారీ చేస్తుంది. ఇది వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని 'డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్' (డీపీఐఐటీ) కింద పని చేస్తుంది. భౌగోళిక సూచికల రిజిస్ట్రీ కార్యాలయం చెన్నైలో ఉంది. ఈ ట్యాగ్‌లను 'వస్తువుల భౌగోళిక సూచికల (రిజిస్ట్రేషన్ మరియు రక్షణ) చట్టం, 1999' ప్రకారం జారీ చేస్తారు. పేటెంట్లు, డిజైన్లు, ట్రేడ్‌మార్క్‌ల కంట్రోలర్ జనరల్ భౌగోళిక సూచికల రిజిస్ట్రీకి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తారు. ఒకసారి జారీ చేసిన భౌగోళిక సూచిక(జీఐ) ట్యాగ్ పది సంవత్సరాలు చెల్లుబాటు అవుతుంది. ఆ తర్వాత దానిని పునరుద్ధరించుకోవచ్చు. అనధికారికంగా జియోగ్రాఫికల్ ఇండికేషన్‌ను ఉపయోగిస్తూ ఇతర ప్రాంతాలలో ఉత్పత్తి అయిన వస్తువులను ప్రత్యేక ప్రాంతాల్లో తయారయినట్లు ప్రజలను తప్పుదారి పట్టించటం జియోగ్రాఫికల్ ఇండికేషన్‌లను ఉల్లంఘించటమే అవుతుంది. అధీకృత వినియోగదారులు మరణించిన సందర్భంలో వారసులకు హక్కులు బదిలీ అవుతాయి. జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ (భౌగోళిక గుర్తింపుజీఐ) గుర్తింపు ఉన్న ఉత్పత్తులకు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోంది. వాటి ప్రత్యేకతే దీనికి కారణం. డార్జిలింగ్ టీ, పోచంపల్లి ఇక్కత్, మైసూర్ సిల్క్, కొండపల్లి బొమ్మలు, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నిర్మల్ బొమ్మలు, బికనీర్ భుజియా, గుంటూరు సన్న మిరప, హైదరాబాద్ హలీమ్.. భౌగోళిక గుర్తింపు దక్కించుకున్న ఈ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధర పలుకుతోంది. అందుకే వీటిని విక్రయించేందుకు ప్రముఖ ఆన్‌లైన్ సంస్థలూ ముందుకొస్తున్నాయి. ఈ భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులను అనుమతి లేకుండా ఇతరులు వినియోగించకూడదు. అయితే రిజిస్ట్రేషన్ తప్పనిసరి కాదు. కానీ రిజిస్ట్రేషన్ వలన మేలైన చట్ట సంరక్షణ సాధ్యమవుతుంది. వ్యక్తులు, ఉత్పత్తిదారులు, చట్టప్రకారం ఏర్పాటయిన సంస్థలు, లేదా అథారిటీలు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉత్పత్తిదారుల ప్రయోజనాలను దరఖాస్తులో పేర్కొనాలి. నిర్ణీత దరఖాస్తులో వివరాలను తెలియజేయాలి. నిర్ధారిత రుసుమును చెల్లించి రిజిస్ట్రార్ ఆఫ్ జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ పేరిట దరఖాస్తు చేయవలసి ఉంటుంది.

ఉత్పత్తి దారులంటే...

ప్రొడక్షన్, ప్రాసెసింగ్, ట్రేడింగ్ లేదా డీలింగ్‌తో ముడిపడిన వ్యవసాయ ఉత్పత్తులు.

ఎక్స్‌ప్లాయిటింగ్, ట్రేడింగ్, డీలింగ్‌తో ముడిపడిన సహజ ఉత్పత్తులు.మేకింగ్, మాన్యుఫాక్చరింగ్, ట్రేడింగ్, డీలింగ్‌తో ముడిపడిన హస్తకళలు, పారిశ్రామిక ఉత్పత్తులు వంటి విభాగాలకు సంబంధించి కార్యక్రమాలు చేపట్టే వారిని 'ఉత్పత్తిదారులు'గా భావిస్తారు.

జీఐ, ట్రేడ్ మార్క్ ఒకటేనా..

జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్), ట్రేడ్ మార్కు అనేవి వేర్వేరు. వ్యాపారం చేస్తున్న సందర్భంలో ఉపయోగించే చిహ్నం ట్రేడ్ మార్క్. వేర్వేరు వ్యాపార సంస్థల వస్తువులను గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఏదేనీ ప్రత్యేక భౌగోళిక ప్రాంతం నుంచి కొన్ని ప్రత్యేక లక్షణాలతో తయారయిన వస్తువులను గుర్తించేందుకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ ఉపయోగపడుతుంది.

- కత్తుల లక్ష్మారెడ్డి,
సిద్దన్నపేట

ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

సెమీస్‌కు కర్ణాటక, సౌరాష్ట్ర

దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్స్ కర్నాటకతో పాటు సౌరాష్ట్ర సెమీస్ బెర్తులను ఖరారు చేసుకున్నాయి. క్వార్టర్స్ పోరులో కర్ణాటక. పటిష్ట ముంబైని చిత్తుచేయగా మరోపోరులో టోర్నీ ఆసాంతం ఓటమన్నదే లేకుండా సాగిన ఉత్తరప్రదేశ్‌ను ఓడించిన సౌరాష్ట్ర సెమీస్ చేరుకుంది. బీసీసీఐ సీవోఈ వేదికగా జరిగిన తొలి క్వార్టర్స్‌లో ముంబై.. 50 ఓవర్లలో 254/8 రన్స్ చేయగా కర్ణాటక బ్యాటింగ్ చేస్తుండగా (33 ఓవర్లలో 132/1 వద్ద) ఆటకు వర్షం అంతరాయం కల్గింది.దీంతో విజేతను వీజేడీ (వి. జయదేవన్ సిస్టమ్) పద్ధతిలో తేల్చగా కర్ణాటక 55 పరుగుల తేడాతో విజయం సాధించింది. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన దేవ్‌దత్ పడిక్కల్ (81), వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ (74) నాటౌట్‌గా నిలిచి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక యూపీ, సౌరాష్ట్ర పోరుకూ వరుణుడు ఆటంకం కల్గించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ.. నిర్ణీత ఓవర్లలో 310/8 రన్స్ చేసింది. ఛేదనలో సౌరాష్ట్ర 238/3 వద్ద ఉండగా వాన రావడంతో వీజేడీ పద్ధతిలో 17 పరుగుల తేడాతో ఆ జట్టు గెలుపొందింది.

యూపీపై ఆర్‌సీబీ ఘనవిజయం

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మాజీ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వరుసగా రెండో విజయాన్ని నమోదుచేసింది. మొదట బంతితో తర్వాత బ్యాట్ తో దుమ్మురేపిన ఆ జట్టు.. ముంబై వేదికగా పూర్తి ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌ను చిత్తుగా ఓడించింది. ముందు బ్యాటింగ్ చేసిన వారియర్స్.. 20 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 143 రన్స్‌కే పరిమితమైంది. దీప్తి శర్మ (35 బంతుల్లో 45 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్స్), డాటిన్ (37 బంతుల్లో 40 నాటౌట్, 3 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకోకుంటే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బెంగళూరు 12.1 ఓవర్లే అవసరమయ్యాయి. ఛేదనలో విధ్వంసకర బ్యాటర్ గ్రేస్ హారిస్ (40 బంతుల్లో 85, 10 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులకు తోడు కెప్టెన్ స్మృతి మంధాన (32 బంతుల్లో 47 నాటౌట్, 9 ఫోర్లు) ధనాధన్ మెరుపులతో ఆ జట్టు విజయం నల్లేరు పై నడకే అయింది. హారిస్‌కే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ టోర్నీలో యూపీకి ఇది వరుసగా రెండో ఓటమి.స్వల్ప ఛేదనను హారిస్ తన విధ్వంసకర ఆటతో మరింత చిన్నదిగా మార్చేసింది. దీప్తి తొలి ఓవర్లోనే రెండు బౌండరీలు బాదిన ఆమె.. క్రీజులో ఉన్నంత సేపు అదే దూకుడును కొనసాగించింది. శిఖా 3వ ఓవర్లో స్మృతి కూడా రెండు ఫోర్లు సాధించింది. డాటిన 6వ ఓవర్లో అయితే హారిస్.. 4, 6, 4, 6, 6, 4తో ఏకంగా 32 పరుగులు రాబట్టడమే గాక 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీని సాధించింది. ఆమె దూకుడుతో ఆర్‌సీబీ.. 6 ఓవర్లకే 78/0తో నిలిచి విజయాన్ని ఖాయం చేసుకుంది. 48 బంతులకే బెంగళూరు వంద పరుగుల మార్కును దాటడం విశేషం. డబ్ల్యూపీఎల్‌లో ఒక జట్టు తక్కువ బంతుల్లోనే సెంచరీకి చేరువవడం ఇది మూడోసారి. ధాటిగా ఆడే క్రమంలో హారిస్ ఆ జట్టు విజయానికి 6 పరుగుల దూరంలో ఔట్ అయినా రిచా (4*), స్మృతి లాంఛనాన్ని పూర్తిచేశారు. 47 బంతులు మిగిలుండగానే బెంగళూరు విజయాన్ని అందుకోవడం విశేషం.50/5.. మొదట బ్యాటింగ్ చేసిన యూపీ 8.2 ఓవర్లలో చేసిన స్కోరది. ఆ స్థితి నుంచి వారియర్స్ జట్టు గౌరవప్రదమైన స్కోరు చేసిందంటే దానికి కారణం దీప్తి, డాటిన్ పోరాటమే. ఆరంభంలో బెల్, స్మిత్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో యూపీకి పరుగుల రాకే గగనమైంది. బెల్.. 5వ ఓవర్లో హర్లీన్ (11)ను ఔట్ చేయగా శ్రేయాంక 8వ ఓవర్లో లానింగ్ (14), ప్రమాదకర లిచ్‌ఫీల్డ్ (20)ను ఔట్ చేసి ఆ జట్టును దెబ్బతీసింది. అదే ఊపులో డీ క్లెర్క్.. 9వ ఓవర్లో కిరణ్ (5), సెహ్రావత్‌ను బోల్తా కొట్టించింది. 8.2 ఓవర్లలో 50/5గా ఉన్న యూపీని దీప్తి, డాటిన్ ఆదుకుని అభేద్యమైన 6 వికెట్‌కు 70 బంతుల్లో 93 రన్స్ జోడించారు.

కేకేఆర్‌కు బిగ్ షాక్..

బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఇటీవల జరిగిన ఐపీఎల్ మినీ వేలం 2026లో 9.20 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అయితే బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం రాజకీయ అనిశ్చితి తలెత్తిన నేపథ్యంలో అక్కడి హిందువులపై వరుస దాడులు కొనసాగుతుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో బంగ్లా ఆటగాడిని ఐపీఎల్‌లో ఆడించనుండటంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీన్ని పరిగణలోకి తీసుకున్న బీసీసీఐ.. ముస్తాఫిజుర్ రెహమాన్‌ను రిలీజ్ చేయాలని కేకేఆర్ ఫ్రాంఛైజీని శనివారం ఆదేశించింది. దీంతో అతన్ని కేకేఆర్ విడుదల చేసింది. ముస్తాఫిజుర్ ఒక్క బంతిని కూడా బౌల్ చేయకుండానే ఐపీఎల్ నుంచి నిష్క్రమించినట్లైంది. అయితే అతడి కోసం కేకేఆర్ వెచ్చించిన ఆ రూ.9.20 కోట్లు వారి పర్స్‌కు తిరిగి చేరతాయా? లేదా? అనే సందేహాలు నెలకొన్నాయి. ఈ విషయంలో ఐపీఎల్ వేలం నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..ఏదైనా ఫ్రాంఛైజీ ఒక్కసారి ఆటగాడిని వేలంలో దక్కించుకుంటే.. దాని పర్స్ నుంచి ఆ మొత్తం మైనస్ అవుతుంది. అయితే ప్రస్తుతం ముస్తాఫిజుర్ అంశం ప్రత్యేకమైంది. అలాగే తప్పనిసరిగా అతన్ని రిలీజ్ చేయమని బీసీసీఐ ఆదేశించింది. భారత క్రికెట్ బోర్డు జోక్యంతో, క్రికెట్‌కు సంబంధం లేని కారణాలతో ముస్తాఫిజుర్ జట్టుకు దూరమయ్యాడు. కాబట్టి ఐపీఎల్ నిబంధనల ప్రకారం కేకేఆర్ పర్స్‌లోకి ఆ మొత్తం వచ్చి చేరుతుంది. అయితే ముస్తాఫిజుర్.. కేకేఆర్, బీసీసీఐ నుంచి పరిహారం డిమాండ్ చేసే అవకాశం ఉంది. అదే జరిగితే పరిస్థితి ఏంటనే అంశం ప్రస్తుతం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంఛైజీ ముస్తాఫిజుర్ రెహమాన్ స్థానంలో మరో ఆటగాడిని తీసుకోవడానికి అనుమతిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించారు. కానీ.. ఆ నిధులు ఎప్పుడు?.. ఎలా..? కేకేఆర్ తిరిగి పొందుతుందో ఆయన ప్రత్యేకంగా వివరించలేదు. అయితే మొత్తానికి కేకేఆర్ పర్స్‌లో త్వరలోనే రూ.9.20 కోట్లు వచ్చి చేరే అవకాశముంది. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరున్న ముస్తాఫిజుర్ స్థానాన్ని కేకేఆర్ ఏ ఆటగాడితో భర్తీ చేయనుందనే విషయంలో మాత్రం ఆసక్తి నెలకొంది.

చిరు 'శంకరవరప్రసాద్'.. బాక్సాఫీస్ రఫ్ఫాడిస్తోంది!

వరుసగా 8 విజయాలతో తిరుగులేని దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు అనిల్ రావిపూడి ఇప్పుడు చిరంజీవితో ఆయన 'మన శంకరవరప్రసాద్‌గారు' అంటూ మరోసారి సంక్రాంతికి వచ్చి ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే కాకుండా, బాక్సాఫీస్ వద్ద 9వ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇండస్ట్రీలో ఉన్న అతి తక్కువ మంది సక్సెస్‌ఫుల్ డైరెక్టర్స్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ఓవర్సీస్‌లోనూ ఈ మూవీ మంచి వసూళ్లను రాబడుతోంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం పోస్టర్‌ను పంచుకుంది. ప్రీమియర్స్ ద్వారా ఉత్తర అమెరికాలో ఈ మూవీ 1.5 మిలియన్ డాలర్లు వసూలు చేసింది. ఇప్పటివరకూ వచ్చిన చిరు సినిమాల్లో ఆల్‌టైమ్ ప్రీమియర్స్ రికార్డును నెలకొల్పింది. వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ మూవీకి బుకింగ్స్ పెరిగాయి.ఇప్పుడున్న దర్శకులు ఒక్కో సినిమా చేయడానికి ఏడాది నుంచి రెండేళ్ల సమయం తీసుకుంటున్నారు. ఇటీవల కాలంలో అగ్ర కథానాయకుడు నటించిన ఏ సినిమా చెప్పిన తేదీకి విడుదల కాలేదంటే అతిశయోక్తి కాదు. కానీ, తక్కువ బడ్జెట్ తో పరిమిత లొకేషన్స్‌లో కేవలం 9 నెలల్లోనే సినిమాను పూర్తి చేసి, విడుదల చేయడం దర్శకుడు అనిల్ రావిపూడికే దక్కింది. గతంలోనూ మహేశ్‌బాబుతో 'సరిలేరు నీకెవ్వరు' మూవీని ఇలాగే తక్కువ సమయంలో తీసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇప్పుడు 'మన శంకరవరప్రసాద్‌గారు'ను కూడా అలా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం గమనార్హం. ఏప్రిల్‌లో మొదలైన షూటింగ్‌ను పరుగులు పెట్టించారు. ఇది సాకారం అవ్వడానికి దర్శకుడికి చిత్ర బృందం ఎంతో సహకారం అందించింది. ఇక చిరంజీవి నుంచి వచ్చిన సపోర్ట్ అంతా ఇంతా కాదు. సమ్మె కారణంగా కొన్ని రోజులు షూటింగ్ వాయిదా పడినా పక్కా ప్రణాళికతో అనిల్ చిత్రీకరణ పూర్తి చేశారు. అన్ని విషయాల్లో కచ్చితంగా ఉండే నయనతారలాంటి ఆర్టిస్ట్‌తో ప్రమోషన్స్ చేయించారు. ఇక ఈ సినిమా ప్రారంభోత్సవం సందర్భంగా చిత్రానికి పనిచేసే టీమ్‌ను పరిచయం చేస్తూ చివరిలో అనిల్ రావిపూడి 'వచ్చే సంక్రాంతికి బాక్సాఫీస్‌ను రఫ్ఫాడించేద్దాం' అన్నారు. అన్నట్లుగానే ఈ సంక్రాంతి బాక్సాఫీస్‌ను రఫ్ఫాడించేస్తున్నారంటూ పలువురు ఈ వీడియోను పంచుకుంటున్నారు.

టాక్సిక్ టీజర్‌పై ట్రోల్స్..

కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాలతో దేశ వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ను తెచ్చుకున్నారు కన్నడ రాక్ స్టార్ యష్. కెజిఎఫ్2 తర్వాత యష్ ఎవరితో సినిమా చేస్తారా అని అనుకోగా, అందరికీ షాకిస్తూ యష్, లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో సినిమాను ఓకే చేశారు. టాక్సిక్ అనే టైటిల్ తో రూపొందుతున్న ఈ సినిమా నుంచి రీసెంట్ గా యష్ బర్త్ డే సందర్భంగా ఓ టీజర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. రీసెంట్ గా రిలీజైన గ్లింప్స్ కు చాలా మంది ఆడియన్స్ నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. చాలా మంది ప్రేక్షకులు అసలు అలాంటి ఇంట్రడక్షన్ వీడియో అవసరమా అని, ఇలాంటి వీడియోలు సినిమాపై ఉన్న దృష్టిని కూడా మారుస్తాయని అంటున్నారు. దీంతో ఈ విషయం ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. ఇదే సినిమాను ఎవరైనా మేల్ డైరెక్టర్ కానీ తీసి, ఇలాంటి వీడియోనే రిలీజ్ చేసి ఉంటే ఏ రకమైన విమర్శలు వచ్చి ఉండేవనే దాని గురించి కూడా చర్చిస్తున్నారు.టాక్సిక్ సినిమాకు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించడం వల్ల ఆ నెగిటివిటీ బయటపడటానికి కొంచెం టైమ్ పట్టింది. భారీ బడ్జెట్ సినిమాగా తెరకెక్కిన ఈ సినిమాలో ఒక హీరో క్యారెక్టర్ ను పరిచయం చేసే వీడియో ఇలా ఉండటం ఏ మాత్రం బాలేదని కొందరు పెదవి విరుస్తూ దాన్ని విమర్శిస్తున్నారు.

శ్రీలల ఆశలపై నీళ్లు..

టాలీవుడ్‌లో వరుస హిట్ చిత్రాలతో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇటీవల కష్టకాలంలో పడింది. ఆమెకు విజయాల కంటే పరాజయాలే ఎక్కువగా ఎదురవుతున్నాయి. వరుసగా సినిమాలు చేస్తూ అభిమానులను ఎంటర్‌టైన్ చేయాలని ఈ బ్యూటీ భావిస్తోంది. కానీ, ఈ క్రమంలో ఆమె తీసుకుంటున్న తొందరపాటు నిర్ణయాలపై విమర్శలు ఎదురవుతున్నాయి. అదే సమయంలో ఖాళీ దొరికినప్పుడల్లా హిందీ, తమిళ చిత్రాలపై కూడా దృష్టి పెట్టింది. ఈ క్రమంలో శివకార్తికేయన్ నటించిన 'పరాశక్తి' లో ఆమె నటించగా, ఈ సినిమా తమిళంలో రిలీజ్ అయింది.కానీ, 'పరాశక్తి' చిత్రం అక్కడి ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఈ మూవీకి అక్కడ చాలా నిరాశాజనకమైన రెస్పాన్స్ దక్కింది. దీంతో ఈ చిత్రం భారీ డిజాస్టర్ దిశగా సాగుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా శివకార్తికేయన్ మంచి చిత్రాలు చేసినప్పటికీ, 'పరాశక్తి' ఆయన కెరీర్‌లో ఇటీవలి కాలంలోనే అతిపెద్ద ఫ్లాప్‌గా నిలుస్తోంది. ఈ సినిమాతో శ్రీలీలకు తమిళంలో కూడా చేదు అనుభవం ఎదురైంది.ప్రస్తుతం ఆమె పవన్ కల్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్‌ను పూర్తి చేసింది. అలాగే కార్తిక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో తెరకెక్కిన ఆమె తొలి హిందీ చిత్రాన్ని కూడా ముగించింది. అయితే ఇప్పటివరకు కొత్త తెలుగు సినిమాను ప్రకటించలేదు. రాబోయే రోజుల్లో కొత్త ప్రాజెక్టులకు సంతకం చేసే ముందు శ్రీలీల మరింత జాగ్రత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఇంట్లో రిమోట్ ఎవరిదంటే..

'గోల్డెన్ గ్లోబ్స్ 2026' అవార్డు వేడుకలకు నిక్కీ గ్లేజర్‌తో పాటు ప్రియాంక చోప్రా కూడా వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తానికి అంతర్జాతీయ వేదికపై ప్రియాంక అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక ఈ వేడుక ప్రారంభానికి ముందు తన భర్త నిక్ జొనాస్‌తో కలిసి ఆమె రెడ్ కార్పెట్ పై ఫొటోలకు పోజులిచ్చింది. ఐతే, ఈ వేదికపై ఒక ఆసక్తికర ప్రశ్నకు ప్రియాంక చోప్రా సరదాగా బదులిస్తూ.. ఇంట్లో రిమోట్ ఎవరి చేతిలో ఉంటుందని అడగ్గా.. నిక్ చేతిలోనే ఉంటుందని తెలిపింది.ప్రియాంక చోప్రా కంటే ముందు ఆమె భర్త నిక్ మాట్లాడుతూ.. 'గతేడాది మాకు చాలా గొప్పగా గడిచింది. టీవీలో ఏం చూడాలి అనే విషయంలో మా ఇంట్లో ఒకరితో ఒకరం గొడవపడం. ఎవరికి నచ్చింది వాళ్లు చూస్తాం'' అని నిక్ చెప్పాడు. దీనికి ప్రియాంక చోప్రా స్పందిస్తూ.. 'నిక్‌కు నచ్చిన సినిమానే చూడమని చెబుతాను. నేను నా ఐప్యాడ్‌లో చూస్తాను' అని ఆమె తెలిపింది. 2018లో పెళ్లి చేసుకున్న ప్రియాంక నిక్ జొనాస్ లు 2022లో తల్లిదండ్రులయ్యారు. వారికి ఓ కుమార్తె ఉంది.

షెడ్యూల్స్ మధ్య డార్లింగ్ బ్రేక్స్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్.. తన లైనప్ తో ఎంత బిజీగా ఉన్నారో అందరికీ తెలిసిందే. ఆయన అప్ కమింగ్ లిస్ట్ లో చాలా వరకు సీక్వెల్సే ఉన్నాయి. లైనప్ లోని సినిమాలన్నీ భారీ బడ్జెట్ తో రూపొందుతున్నవే. అయితే ఇప్పుడు ఆ చిత్రాల షూటింగ్స్ కోసం సినీ వర్గాలు, సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. సరైన ప్లాన్ లేకపోవడంతో మేకర్స్ కు ఖర్చు తడిసి మోపెడవుతుందని టాక్ వినిపిస్తోంది.ఇటీవల కాలంలో ఆయన సినిమాల షూటింగ్ లు చాలా లేట్ అవుతుండడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారిందనే చెప్పాలి. ప్రభాస్ షెడ్యూల్స్, మధ్యలో తీసుకునే బ్రేక్స్ కారణంగా ఖర్చులు పెరుగుతున్నాయనేది ఇన్ సైడ్ టాక్. రీసెంట్ గా డార్లింగ్ ది రాజా సాబ్ తో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఆ సినిమా విషయంలో అదే జరిగింది. ఎందుకంటే.. ఆ చిత్రం కేవలం ఏడాదిలో పూర్తి కావాల్సి ఉండగా, అలా లేట్ అయిపోయింది.మూడేళ్లపాటు షూటింగ్ జరగడంతో.. ఖర్చులు పెరిగాయి. అందుకు తగ్గట్లు వసూళ్లు ఇప్పుడు సాధించడం లేదని వినికిడి. దీంతో మేకర్స్ ఆలోచనలో పడ్డారని వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో ప్రభాస్ లైనప్ లో ఉన్న మిగతా చిత్రాల నిర్మాతలు జాగ్రత్త పడుతున్నారని తెలుస్తోంది. అయితే డార్లింగ్ మొన్నటి వరకు ఫౌజీ షూటింగ్ లో పాల్గొన్నారు. భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఆ సినిమాలో ఆయనకు చెందిన ఇంకొన్ని సీన్స్ మిగిలి ఉన్నాయట. కానీ ఇంతలో ప్రభాస్.. స్పిరిట్ మూవీ షూటింగ్ స్టార్ట్ చేశారు. నిజానికి ఆ సినిమా చిత్రీకరణ చాలా రోజుల క్రితమే మొదలు కావాల్సి ఉండగా, మేకర్స్ వెయిట్ చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఇటీవల మొదలు పెట్టారు. కానీ ప్రభాస్ స్పిరిట్ షూటింగ్ లో పాల్గొంటున్నా.. ఫౌజీ మాత్రం పెండింగ్ లో ఉంచారు. దానిని త్వరగా పూర్తి చేసేస్తే పర్లేదు. కానీ లేట్ అయితే వడ్డీలు, ఖర్చులు పెరిగిపోతాయని చెప్పాలి.అలా అని స్పిరిట్ మూవీ కంప్లీట్ చేయకుండా మళ్లీ ఫౌజీ సెట్స్ లోకి వెళ్తే.. ఇక్కడ ఖర్చు పెరుగుతుంది. దీంతో నిర్మాతలంతా ఇంకా డైలమాలో పడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇదంతా ఒకెత్తు అయితే ప్రభాస్ లైనప్ లో ఉన్న కల్కి 2898 ఏడీ, సలార్, రాజా సాబ్ సీక్వెల్స్ ఉన్నాయి. అందులో కల్కి సీక్వెల్ షూటింగ్ ఫిబ్రవరిలో స్టార్ట్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ ప్రభాస్ ఫౌజీ, స్పిరిట్ మూవీస్ తో బిజీగా ఉన్నారు. అందుకే ప్రభాస్ తన అప్ కమింగ్ సినిమాల షూటింగ్స్ విషయంలో సరైన ప్లాన్ తో ముందుకు వెళ్లాలని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో షూటింగ్ షెడ్యూల్స్ ను క్లియర్ గా ప్లాన్ చేసి, అనుకున్న టైమ్ కు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, అప్పుడే నిర్మాతలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని టాక్ వినిపిస్తోంది. మరి ప్రభాస్ ఇప్పుడు ఏం చేస్తారో.. ఎలా ప్లాన్ చేస్తారో వేచి చూడాలి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200